# ప్రజాశక్తి

మంగళవారం 16 ఏప్రిల్ 2024

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

# బుజ్జగింపులు

- పెందుర్తి, మాడుగుల అభ్యర్థులను మార్చే ప్రసక్తిలేదన్న బాబు
- బండారు, గవిరెడ్డిలపై ఆగ్రహం
- పార్టీ పదవులతో కొందరిని సంతృప్తిపరిచేయత్నం

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

సార్వత్రిక ఎన్నికల్లో టికెట్‌రాని ఆశావహులను బుజ్జగించే చర్యలను టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ప్రారంభించారు. కూటమి పొత్తుతో టికెట్‌రాక అసంతృప్తితోవున్న నాయకులను సంతృప్తిపర్చే పని ఆరంభించారు. కొంతమందికి పార్టీ బాధ్యతలు అప్పగించారు. మరికొందరిపై కలిసి పనిచేయక తప్పదని ఆసహనం ప్రదర్శించారు. ఆదివారం పాయకరావుపేట, గాజువాకల్లో ప్రజాగళం ముగించుకొని వెళ్తూ విమానాశ్రయంలో కొద్దిసేపు టిడిపి సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి, మాడుగుల మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడులతో విడివిడిగా మాట్లాడారు. తమకు టికెట్ ఇచ్చే విషయం పరిశీలించాలని చంద్రబాబును బండారు, గవిరెడ్డి కోరినప్పుడు, ఇప్పుడున్న పరిస్థితుల్లో చేర్పులు, మార్పులు సాధ్యంకావని, కలిసి పనిచేయాలని ఆయన సూచించారు. అధికారంలోకి వస్తే తగిన గౌరవం, గుర్తింపు ఇస్తామని చెప్పి, పంపించే ప్రయత్నం చేశారు. వారిద్దరూ అందుకు అంగీకరించకపోవడంతో ఒకదశలో వారిపై ఆగ్రహం వ్యక్తంచేసినట్లు తెలిసింది. పార్టీతో తన అనుబంధం, అధికారంలో లేని కాలంలో పార్టీ కోసం పనిచేసినప్పుడు పడ్డ

బండారు సత్యనారాయణమూర్తి

గవిరెడ్డి రామానాయుడు

ఇబ్బందులను ఆయన దృష్టికి బండారు తీసుకెళ్లినా కనీసం పరిగణనలోకి తీసుకోలేదు. టిడిపి బలంగావున్న పెందుర్తి స్థానాన్ని జనసేనకు కేటాయించి, వైసిపి నుంచి వచ్చిన పంచకర్ల రమేష్‌బాబుకు టికెట్ ఇవ్వడంతో సీనియర్ నాయకుడైన తనకు అన్యాయం చేశారని బండారు తన ఆవేదనను వ్యక్తంచేశారు. కూటమి అభ్యర్థుల కోసం పనిచేయడం తప్ప మరో మార్గంలేదని, అసంతృప్తి మంచిదికాదని, పార్టీ నిర్ణయాలకు కట్టుబడి పనిచేయాలని చంద్రబాబు పరుషంగా చెప్పినట్లు విశ్వసనీయ సమాచారం. ఎంత చెప్పినా, చంద్రబాబు వినే పరిస్థితుల్లో లేకపోవడంతో బండారు కోపంగా బయటకు వచ్చినట్లు పార్టీ మిగతా 2లో..

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి లోకనాథం, వేదికపై కాంగ్రెస్ నాయకులు

రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్న

# బిజెపిని గద్దె దించండి

- ఇండియా ఫోరంతోటే రాజ్యాంగ రక్షణ
- సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం

ప్రజాశక్తి - అనకాపల్లి : భారతదేశ ప్రజాస్వామ్యానికి విఘాతం కలిగించి రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్న బిజెపిని గద్దె దించాల్సిందేనని, అలాగే ఆ పార్టీకి వత్తాసు పలుకుతున్న తెలుగుదేశం, జనసేన పార్టీలతోపాటు అధికార వైసిపిని రానున్న ఎన్నికల్లో ఓడించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం పిలుపునిచ్చారు. స్థానిక నాయుళ్ల వీధిలో సోమవారం కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల ప్రచార కార్యాలయాన్ని ప్రారంభించిన నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి ఐఆర్.గంగాధర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో లోకనాథం మాట్లాడారు. రూ.50 వేల కోట్ల ఫోర్జరీ కేసులో బ్యాంకులను లూటీ చేసిన కూటమి ఎంపీ అభ్యర్థి సిఎం రమేష్‌ను ఓడించాలన్నారు. అనకాపల్లి ప్రజలకు మాట్లాడడం రాదని చెప్పిన రమేష్‌ను మిగతా 2లో..

## ఆరో రోజుకు 'గంగవరం' ఆందోళన

▶ వార్త 8లో..

## గ్లోబల్ ఎయిడ్ సంస్థ నిర్వాహకులు సాయిపద్మ మృతి

▶ వార్త మెయిన్‌లో..

## గోస్తనీ చెక్‌పోస్టు వద్ద రూ.2.18 లక్షలు పట్టివేత

▶ వార్త 7లో..

# వాళ్ల మీద వాళ్లే రాళ్లు

టిడిపిపై రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఫైర్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : గాజువాకలో కిందన ఉన్న రాయి తీసి చంద్రబాబుపై దాడి జరిగిందని టిడిపి నేతలు ప్రచారం చేస్తున్నారని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ పేర్కొన్నారు. వాళ్ల మీద వాళ్లు రాళ్లు వేసుకుని వైసిపి మీద విమర్శలు చేస్తున్నారని తెలిపారు. హోటల్ మేఘాలయలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ సిఎం జగన్ మీద జరిగిన దాడి సానుభూతి కోసమని చంద్రబాబు చెప్పడం అవివేకమవు తుందన్నారు. జగన్ బస్ యాత్ర, సిద్ధం సభలకు వస్తున్న ఆధరణ చూసి ఓర్వలేక విమర్శలు చేస్తున్నారన్నారు. అమిత్ షా మీద దాడి చేసిందీ, ఎన్‌టిఆర్ మీద చెప్పులు వేసిందీ, ఎన్‌కౌంటర్ పత్రిక ఎడిటర్ దశరథ రామయ్యను హత్య చేసిందీ ఎవరో అందరికీ తెలుసునన్నారు. సొంత మామకు వెన్నుపోటు పొడిచిన చంద్రబాబు చరిత్ర ఎవరికీ తెలియనిది కాదన్నారు. ఉపాధి కల్పనపై నీతి కబుర్లు మిగతా 2లో..

మాట్లాడుతున్న అమర్‌నాథ్

# ఎన్నికల విధులు నిర్వర్తించాల్సిందే

అధికారులకు డిఆర్‌ఒ కె.మోహన్ కుమార్ ఆదేశం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : తొలి విడత ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తయి ఆర్డర్లు తీసుకున్న వారంతా ఎన్నికల విధులకు తప్పకుండా హాజరుకావాల్సిందేనని, ఎవరికీ మినహాయింపులు లేవని జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్ కుమార్ తెలిపారు. తొలి విడత శిక్షణకు హాజరుకాని వారు తగిన కారణాలు తెలిపాలని ఆయా విభాగాల అధికారులను ఆదేశించారు. ఒపిఒలుగా విధులు కేటాయించిన వారంతా మంగళవారం సాయంత్రం నాటికి ఫారం 12 పత్రాలు సమర్పించాలని సూచించారు. కలెక్టరేట్ మీటింగ్ హాలులో సోమవారం పోలింగ్ పర్సనల్ నోడల్ అధికారి రవీంద్ర, ఎన్ఐసి విభాగ అధికారులతో కలిసి జిల్లా రెవెన్యూ అధికారి మోహన్‌కుమార్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియలో భాగస్వామ్యం కావాల్సిన వారంతా విధిగా వారికి కేటాయించిన విధులకు హాజరు కావాలని, మినహాయింపులు కోరరాదని హితవు పలికారు. అందుబాటులో ఉన్న సిబ్బందిని అవసరాలను దృష్టిలో ఉంచుకొని ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించామని స్పష్టం చేశారు. వారిలో ఇంకెవరికీ మినహాయింపులు మిగతా 2లో..

అధికారులతో సమావేశమైన డిఆర్‌ఒ మోహన్‌కుమార్

## మొదటి పేజీ తరువాయి..

### బుజ్జగింపులు

నాయకులు చెబుతున్నారు.

మాడుగుల నియోజకవర్గంలో తనకున్న పట్టును మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు వివరించినా, ఇప్పుడు మార్పులు సాధ్యంకాదని, ఈసారికి కలిసి పనిచేయాలని చంద్రబాబు సూచించినట్లు తెలిసింది. టిడిపి అభ్యర్థి పైలా ప్రసాదరావును మార్చి తనకు టికెట్ ఇవ్వాలని, వాస్తవ పరిస్థితులు తనకు అనుకూలంగా వున్నాయని గవిరెడ్డి చెప్పినట్లు సమాచారం. 'నా మాట వినకపోతే, మీ ఇష్టం వచ్చినట్లు చేసుకోండి' అని బాబు ఆగ్రహం వ్యక్తంచేయడంతో గవిరెడ్డి వెనుదిరిగినట్లు తెలిసింది. తమకు జరిగిన అన్యాయం, అవమానంపై బండారు, గవిరెడ్డి ఏకరువు పెట్టినా, అవేమీ ఆయన పట్టించుకోలేదు. దీంతో అసంతృప్తితో వారిద్దరూ బయటకు వచ్చినట్లు పార్టీ గ్రూపుల ద్వారా తెలిసింది. ఇదే సమయంలో టికెట్‌రాని ఆశావహులు కొంతమందిని బుజ్జగించేందుకు పార్టీ బాధ్యతలు చంద్రబాబు అప్పగించారు. టిడిపిలో చేరిన దాడి వీరభద్రరావు చురుగ్గా పనిచేయడంలేదని గుర్తించి, ఆయనను ఎన్నికల సంఘం, పత్రిక సమావేశాల కేంద్ర కార్యాలయ సమన్వయకర్తగా, ఆయన తనయుడు రత్నాకర్‌ను, టిడిపి జిల్లా అధ్యక్షుడు బుద్ధ నాగజగదీశ్వరరావును కార్యనిర్వాహక కార్యదర్శులుగా, బత్తుల తాతయ్యబాబును అనకాపల్లి లోక్‌సభ నియోజకవర్గ అధ్యక్షునిగా, బోళెం ముత్యాలపాపను రాష్ట్ర కార్యదర్శిగా నియమించారు. టికెట్‌రాలేదని బాధతోవున్న బండారు, గవిరెడ్డికి పార్టీ బాధ్యతలు అప్పగించకపోవడం వారిని మరింత అవమానపర్చినట్లయింది.

### ఎన్నికల విధులు నిర్వర్తించాల్సిందే

ఉండబోవని తేల్చిచెప్పారు. ఇప్పటికే ఆర్డర్లు తీసుకున్న వారు ఇంకా 1086 మంది ఎక్నాలెడ్జిమెంట్‌లు సమర్పించాలన్నారు. ఒపివోలుగా విధులు కేటాయించిన అధికారులు పోస్టల్ బ్యాలెట్ వినియోగానికి అనుగుణంగా ఫారం-12 పత్రాలు సమర్పించాల్సి ఉందని పేర్కొన్నారు. ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు అధికారులంతా సహకరించాలని డిఆర్‌ఒ ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. పోలింగ్ పర్శనల్ నోడల్ అధికారి రవీంద్ర, ఎన్‌ఐసి అధికారులు పలు అంశాలపై మాట్లాడారు. సమావేశంలో వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

### బిజెపిని గద్దె దించండి

అనకాపల్లి ప్రజలు ఏ విధంగా గెలిపిస్తారన్నారు. జిఎస్‌టి కట్టాలని చెప్పిన అధికారులపై రౌడీయిజం చలాయించి అనకాపల్లి ప్రశాంతతను దెబ్బతీసే విధంగా వ్యవహరిస్తున్న రమేష్‌కు ప్రజలు బుద్ధి చెబుతారన్నారు. జిల్లాలో నాలుగు చెక్కర కర్మాగారాలపైనా, విశాఖ స్టీల్‌ప్లాంట్‌పైనా ఎందుకు ఈ నాయకులు మాట్లాడలేదన్నారు. ఎపికి రాజధాని లేకపోవడంలో టిడిపి, బిజెపి జనసేన, వైసిపి పాత్ర లేదా ? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఎన్నికల పరిశీలకులు చౌహాన్ మాట్లాడుతూ మోడీ తిరిగి అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మార్చేస్తామనడం దారుణమన్నారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే మహిళలకు ఏడాదికి లక్ష రూపాయలు, కేజీ టు పీజీ ఉచిత విద్య, ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తామని, రైతు రుణమాఫీ, రైతుల పంటలకు కనీస మద్దతు ధర, ఉపాధి హామీ కూలీల కూలి రేట్లు పెంపు, ఏడాదికి 30 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని అన్నారు. సమావేశంలో అనకాపల్లి పార్లమెంటరీ నియోజకవర్గ అభ్యర్థి వేగి వెంకటేష్, సిపిఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ, సిపిఐ ఎంఎల్ రాష్ట్ర కార్యదర్శి పిఎస్.అజయ్ కుమార్, నర్సీపట్నం అసెంబ్లీ అభ్యర్థి రుత్తల శ్రీరామ్మూర్తి, పాయకరావుపేట అభ్యర్థి డాక్టర్ బోని తాతారావు తదితరులు పాల్గొన్నారు.

### వాళ్ల మీద వాళ్లే రాళ్లు

చెబుతున్నారని, వాస్తవానికి టిడిపి హయాంలో ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారని ప్రశ్నించారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ మీద టిడిపి వైఖరి చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రైవేటీకరణ యత్నాలు చేస్తున్న బిజెపితో కూటమి ఎలా ఏర్పాటు చేశారని ప్రశ్నించారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటానికి వైసిపి సంపూర్ణ మద్దతు ఇస్తోందన్నారు. చంద్రబాబు ప్యాకేజీ కోసం ప్రత్యేక హోదాను తాకట్టు పెట్టారన్నారు. పోలవరం ప్రాజెక్టును కాంట్రాక్ట్‌మయం చేశారన్నారు. టిడిపి హయాంలోనే కేంద్రం జింక్ పరిశ్రమను అమ్మేసిందన్నారు. 2019 వరకు 55 పరిశ్రమలను ప్రైవేటీకరణ చేసిన ఘనత చంద్రబాబు నాయుడుదేనన్నారు. తాను రాజకీయాల్లోకి వచ్చిన తరువాత అన్ని పరిస్థితులనూ అవగతం చేసుకున్నానన్నారు. పెట్టుబడుల సదస్సులో వచ్చిన పెట్టుబడుల్లో 19 శాతం గ్రౌండ్ అయ్యాయని ఒక ప్రశ్నకు సమాధానమిచ్చారు.

**నోటీస్**
**మహారాజశ్రీ బొబ్బిలి సీనియర్ సివిల్ జడ్జ్ వారి కోర్ట్‌లో**
**IA 207/2023 O.S. 24/2023**

పూడి సింహాచలం .......వాది.
మిరియాల సత్యనారాయణ @ సత్యం నాయుడు .....ప్రతివాది.

మిరియాల సత్యనారాయణ @ సత్యం నాయుడు S/o బలరామ్ నాయుడు వెంకటాపురం గ్రామం, మునగపాక మండలం, విశాఖపట్నం జిల్లా

ఇందలి వాది పై నెంబర్ దావాలో మీపై బకాయి రాబట్టు నిమిత్తమూ దాఖలు చేసిన దావా మరియు ప్రధమ జప్తు పిటిషన్ IA 207/2023 **తే.20.06.2024 దీ**ని వాయిదా అయి ఉన్నది . ఆ దినము మీరు శ్రీ కోర్టు వారి యెదుట **ఉదయం 10.30 ని.**లకు స్వయముగా గాని, మీ అధీకృత ఏజెంట్ ద్వారా గాని హాజరై మీ వాదన దాఖలు చేసుకోగలరు. లేనియెడల మీ పరోక్షమున పై దావా పరిష్కరించబడును.

(శ్రీ కోర్టువారి ఆదేశములతో )

**తిరుపతి పాణిగ్రాహి**
వాదితరపు న్యాయవాది
బొబ్బిలి

# ముగిసిన వెయిట్ లిఫ్టింగ్ పోటీలు

**ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ :** వాల్తేర్, ఈస్ట్‌కోస్ట్ రైల్వే స్పోర్ట్స్ అసోసియేషన్ నిర్వహించిన మొదటి వాల్తేరు రైల్వే డివిజన్ స్పోర్ట్స్ ఫెస్టివల్‌లో, వెయిట్‌లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలు సోమవారం ముగిసింది. ఈ పోటీలలో సివిల్ ఇంజినీరింగ్ మహిళల జట్టు టైటిల్‌ను కైవసం చేసుకోగా, క్యారేజ్ అండ్ వ్యాగన్ జట్టు పురుషుల టైటిల్‌ను కైవసం చేసుకుంది. మహిళల విభాగంలో 45 కేజీల విభాగంలో ఎస్ లక్ష్మి, 49 కేజీల విభాగంలో పి నాగమణి, 55 కేజీల విభాగంలో పుణ్యవతి, 59 కేజీల విభాగంలో కె నీలవేణి, 64 కేజీల విభాగంలో కె. శారద, 71 కేజీల విభాగంలో సునీత నాయక్, 76 కేజీల విభాగంలో జి పద్మావతి, 81 కేజీల విభాగంలో పి ఉష, 87 కేజీల విభాగంలో ఎస్ పద్మ, 87 కేజీల విభాగంలో ఎం.జయ శివవర్ధిని స్వర్ణ పతకాలు సాధించారు.

పురుషుల విభాగంలో 55 కేజీల విభాగంలో సిహెచ్.ఉపేంద్ర, 61 కేజీల విభాగంలో కేయూఎం రావు, 67 కేజీల విభాగంలో వైఎన్ మూర్తి, 73 కేజీల విభాగంలో జి అప్పన్న, 81 కేజీల విభాగంలో పి సంతోష్ కుమార్, 89 కేజీల విభాగంలో కేవీ రమణాచారి, 96 కేజీల విభాగంలో జె రాజ్‌కుమార్, 102 కేజీల విభాగంలో పి శ్రీను, 109 కేజీల విభాగంలో ఆర్ శ్రీనివాస్, 109 కేజీల విభాగంలో ఎం ప్రదీప్ స్వర్ణ పతకాలు సాధించారు.

# క్రీడాకారులకు అండగా ఉంటాం

**ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ :** క్రీడాకారులకు ఎల్లవేళలా అండగా ఉంటామని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. ఆంధ్ర బాక్సింగ్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ, ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎంఎస్ఎస్. శ్రీనివాస్ సంయుక్త ఆధ్వర్యంలో వివిధ బాక్సింగ్, కరాటే, కిక్ బాక్సింగ్, ఫుట్‌బాల్ అసోసియేషన్ల సభ్యులు, క్రీడాకారులు, ప్రైవేటు ఎంప్లాయిస్ సుమారు 3000 మంది సోమవారం మధ్యాహ్నం బీచ్ రోడ్డులోని వైసిపి పార్లమెంట్ అభ్యర్థి బొత్స ఝాన్సీ కార్యాలయలో వైసిపిలో చేరారు. కార్యక్రమంలో మంత్రి బొత్స సత్యనారాయణ, పార్లమెంట్ పరిశీలకులు మళ్ల విజయప్రసాద్, కాయల వెంకటరెడ్డి, జిసిసి ఛైర్‌పర్సన్ స్వాతిరాణి, యువనాయకులు డాక్టర్ బొత్స సందీప్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.రవిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా బొత్స మాట్లాడుతూ రాష్ట్రంలో యువతకు అన్ని రంగాల్లో వైసిపి ప్రాధాన్యతనిచ్చిందన్నారు. ఇటీవల జరిగిన 'ఆడుదాం ఆంధ్ర'కి మంచి స్పందన వచ్చిందని గుర్తు చేశారు. స్పోర్ట్స్ విద్యార్థులకు 24 గంటలూ తాను అందుబాటులో ఉంటానని భరోసానిచ్చారు.

# విద్యలో కాషాయీకరణ వద్దు

**ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ :** కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన కాషాయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని ఆల్ ఇండియా సేవ్ కమిటి రాష్ట్ర సలహాదారులు డాక్టర్ ఎన్.చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు ఎస్. గోవింద రాజు డిమాండ్ చేశారు. సోమవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ఆల్ ఇండియా సేవ్ ఎడ్యుకేషన్ కమిటి రూపొందించిన ప్రజా ప్రత్యామ్నాయ విధానం మేనిఫెస్టోను విడుదల చేశారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తెచ్చిన జాతీయ విద్యా విధానం 2020 నుంచి దేశంలోనూ, రాష్ట్రంలోనూ అమలవుతోందన్నారు. ఓట్ల రాజకీయాలు చేస్తున్న రాజకీయ పార్టీలన్నీ విద్య ఊసెత్తక పోవడం శోచనీయమన్నారు. కేంద్ర బడ్జెట్లో 10 శాతం నిధులను విద్యకు గ్యారంటీ చేయాలన్నారు.

జ్ఞానంతో పరిపూర్ణమైన మనిషిని రూపొందించే ప్రక్రియగా, సామాజిక బాధ్యత, స్పృహ కలిగిన పౌరునిగా మలిచే సాధనంగా విద్యా లక్ష్యాన్ని నిర్వచించాలని కోరారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ కొలవెన్ను, అడ్వకేట్ జహ అరా పాల్గొన్నారు.

### 30వ వార్డులో ఝాన్సీ, వాసుపల్లి ప్రచారం

**ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ :** వైసిపి విశాఖ పార్లమెంట్ అభ్యర్థి బొత్స ఝాన్సీ, దక్షిణ అసెంబ్లీ అభ్యర్థి వాసుపల్లి గణేష్ కుమార్ జివిఎంసి 30వ వార్డులో ప్రచారం చేపట్టారు. కార్పొరేటర్ కోడూరు అప్పలరత్నం (కొండమ్మ) ఆధ్వర్యంలో రోడ్ షో నిర్వహించారు. స్థానిక నేతలు గజమాల, హారతులిచ్చి స్వాగతం పలికారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా అధ్యక్షులు కోలా గురువులు, రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ జాన్ వెస్లీ, దక్షిణ పరిశీలకులు ద్రోణంరాజు శ్రీవాత్సవ్, డాక్టర్ జహీర్ అహ్మద్, రెల్లి కార్పొరేషన్ చైర్మన్ వడ్డాది మధుసూదన్ రెడ్డి, కో ఆప్షన్ సభ్యుడు షరీఫ్, వైసిపి నాయకులు దశమంతల మాణిక్యాలు పాల్గొన్నారు.

**IN THE HON'BLE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE AT: BHEEMUNIPATNAM**
**I.A.2049/2023 in O.S.272/2020**

**Between:**
Matta Venkata Gopalakrishna (died) and others . . . Petitioners
**And:**
Konada Danavamma @ Danhalakshmi ...Respondent

**NOTICE**

To, **The Respondent**:
**Konada Danavamma @ Danhalakshmi,** W/o. Nookaraju, R/at D.No. 20-112-3, Chengalaraopeta, China Bazar, Beside Subrahmanyam Doctor Clinic, Visakhapatnam-530001.

The above named petitioners have filed the above interlocutory application against you under Order XXII Rule 3 of CPC to add the legal heirs of the deceased petitioner/ plaintiff in the above suit. The above application stands posted to **09-05-2024** at **10:30 A.M.** for your appearance before the Hon'ble Court. You are hereby informed to attend before the above Court on the said date with relevant records either yourself in person or through an Advocate duly instructed by you, failing which the matter will be decided accordingly as per the material available in your absence.

**MKS ASSOCIATES**
**M.S. VENKATESH,**
**M.K. SRINIVAS &**
**M. KAUSHIK**
Advocates, Visakhapatnam.

**IN THE HON'BLE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE AT: VISAKHAPATNAM**
**E.P.46/2022 in O.S.16/2021**

**Between**:
Smt. Totakura Aruna ... D.Hr/Plaintiff
**And:**
Sri Lalam Appala Raju ...J.Dr/Defendant

**NOTICE**

To,**The J.Dr:**
**Sri Lalam Appala Raju,**
S/o. Lalam Sri Ramulu (Late), Hindu, aged about 60 years, Chits & Finance Business, R/at. D.No.15-199, Simhagiri Colony, Kailasapuram Post, Visakhapatnam-530024.

Please take notice that the above named D.Hr filed by the above E.P.46/2022 under Order 21 Rule 54 and Rule 64 to 66 of C.P.C. and the matter stands posted to **26-04-2024** for your appearance either in person or through a Pleader on the above said date at **10:30 A.M.** to answer all material questions failing which the matter will be heard and determined in your absence exparte as per law.

**J. PRITHVI RAJ,**
Advocate
# 43-9-16/8, Narayana Towers, Rly. New Colony, Visakhapatnam,
**Cell: 9848186150.**

**IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE AT BHEEMUNIPATNAM**
**E.P. 64/2022 in O.S. 150/2022**

**Between:**
**Smt. Palla Appayyamma** . . . Decree Holder
**And:**
**Smt. Buddala Varalakshmi** . . . Judgement Debtors

**వేలం ప్రకటన**

పై నెంబరు అమలు పిటిషన్‌లో డిక్రీ బాకీ+ వడ్డీ మరియు ఖర్చులు రాబట్టు నిమిత్తం పై తెలిపిన జడ్జిమెంట్ డెటారు యొక్క ఈక్రింది షెడ్యూలు ఆస్తిని **తేది: 29-4-2024న** వేలం వేయుటకు మహారాజశ్రీ కోర్టు వారు ఉత్తర్వులు జారీ చేసియున్నారు. కావున వేలం **తేది: 29.4.2024న ఉదయం గం. 10-30 ని॥లకు నుండి సా॥ గం.5.00** మధ్య సమయంలో వేలం వేయుదురు. సదరు వేలం పాటలో పాల్గొనదలచిన ఆసక్తి గల వారు పై తేదీన పై తెలిపిన శ్రీకోర్టు వారి ఎదుట హాజరై వేలం షరతులుకు లోబడి పాడుకొన వచ్చునని ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయడమైనది.

**SCHEDULE**

All that part and parcel of the Zeroithy Land measuring an extent of Ac. 0-49 cents or 0.196 hectors, covered by S.No. 17/4, situated at Venkatapuram Village, Padmanabham Mandal, Visakha patnam District and bounded as follows:
**North:** Zeroithy Land belongs to Barla Peda Suridu
**South:** Zeroithy Land belongs to Barla Gangulu
**East :** Allu Polipalli Tadipendi
**West:** Zeroithy Land belongs to Karri Suridu & Others

**T.JEEVAN**
**BUDDHA (S) HEMLATHA**
Advocates,
Cell : 7032644015

**IN THE HON'BLE COURT OF THE II ADDL. SENIOR CIVIL JUDGE AT: VISAKHAPATNAM**
**I.P.10/2024**

**Between:**
**Sri Pulluru Dilip Kumar,**
S/o. P. Kesavulu Hindu, aged 36 years, R/at D.No.8-272/9/1, VUDA Colony, Gopalapatnam, Visakhapatnam **...Petitioner**
**And:**
**B. Varun Rohit** & 22 others **...Respondents**

To,
**1) B. Varun Rohit,** S/o. Venkata Sundhakar Boyapalli, Hindu, 36 years, R/at #4006, Block-A, Tne Life Apartment Vasanth City Inner Road, Bikshapathi Nagar, Hafeezpeta-500084.
**2) M. Sahithi,** W/o. B. Varun Rohit, Hindu, 34 years, Rest-do-
**3) Suriti Hariteja,** S/o. S.Ramulu, Hindu, 31 years, R/at H.No.11-13-1181/ 3/07, TNR 1, Vaishnovi Apartment, NCAR AshtalakshmiTemple, Vasavi Colony, Kothapeta, Saroor Nagar, Hyderabad-500035.
**4) K.Anil Kumar,** S/o. K.C.Venku Reddy, Hindu, 45 years, R/at Flat No.5003, B-Block, The Life Apartment, Vasantha City inner Road, Bikshapathi Nagar, Hafeezpeta-800084
**5) T.Nageswara Rao,** S/o.VashalaVenkateswrulu, Hindu, 38 year, R/at H.No.4-32-1, Plot No.105, Flat No.501, Saptgiri Nivas, Saptagiri Colony, Tirumala Nagar, MedchalMalkajigiri,Telangana-500072.
**6) T.Devadas**, S/o. not known, Hindu, 53 years, R/at Flat No.202, Block-03, Gayathri Tower, Near Pranam Hospital, Madinaguda, Miyapur-500049.
**7) Penumanchi Bhavana,** D/o. P.S.N.Raju, Hindu, 55 years, R/at 5th Floor, D-6, Winning Tower, JNTU<Hitech City Main Road, Behind Indian Oil Petrol Bunk, Khaamet, Madapur-500081.
**8) A. Murali Krishna**, S/o. Not known, Hindu, 40 years, Rest-do-
**9) P. Santhosh,** S/o. Not known, Hindu, 34 years, R/at H.No.20-17, Housing Colony, Ward No.15, Kasimkota Mandal, AnakapalliDist.
**10) Moti Sagar Trivedi,** S/o. Vidya Sagar Trivedi, Hindu, 40 years, R/at D.No.13-1-53/A/14, Yousafguda, Mothinagar-500045
**11)Gaji Vamsi,** S/o. Venkata Rao, Hindu, 40 years, R/at D.No.1-11-251/9, Behind Shoppers Stop, Begumpeta, Hyderabad-500016.
**12) Kandikunta Venkata Prasad,** S/o K. Raghuramappa, Hindu, 55 years, R/at 3-5, HindupurRoad, Behind Ramswamy Temple, Kadiri Anatapuram-515591.
**13) G.Muralidhar,** S/o. not known, Hindu, 48 years,R/at D.No.20-3-5/A, 1stFloor,Sivajyothi Nagar, Tirupathi-517501.
**14) Narahari Mohan Das,** S/o. Pullaiah Setty, Hindu, 45 years, R/at # 43/240-a,Srilaxmi Nilayam, First Floor, NR Peta, Chinmaiah School, Kurnool-518004.
**15) Srinivasa Gupta Narayana,** S/o.Veeramjaneya Kumar Narayana, 18 years, R/at D.No.57/8, Upstairs Narayana Nilayam, Old Municipal office Road fort, Kurnool-518001.
**16) S.Anitha,** W/o.SomavaramVenkataram Prasad, Hindu, 56 years, R/at Plot No.240/B/1, Road No.8, Jubili Hills, Hyderabad-500033.
**17) A.L.N.S.Prakash,** S/o. not known, Hindu, 60 years, R/at Lotus MAC Credit Society ltd., Srinagar Colony, KamalapurColony, Banjara Hills, Hyerabad-500073.
**18) B.Mahalakshmi,** W/o. Late B.Sivaprasad, Hindu, 40 years, R/at D.No.12-7-107/3/2, New Mettuguda, Secunderabad, Hyderabad-17.
**19) Pettluru Ramu,** S/o. P.Raghava Reddy, Hindu, 36 years, R/at D.No.1-56, Palugodu(Po)&(V), DakkiliMandalam, Tirupathi Dist- 524134.
**20) Narendra Chari,** S/o. Not known, Hindu, 40 years, R/at Road No.10, Jubli Hills, Near Daimond House, Hyderabad.
**21) Satish,** S/o. Not known, Hindu, 50 years, R/at Flat No.201, Kishore Nikethan Apartment, 2" Floor, Kundan bagh, Begumpeta, Hyderabad-16.
**22) G.Avinash,** S/o. late Sankara Rao, Hindu, 44 years, R/at Ramky Towers, C-block, 903, Gachibowli, Hyderabad.
**23) Atlluri Sunitha,**W/o.Prasad, Hindu, 44 years, R/at Flat No.201,2nd Floor, Sri Durga Nilayam, Yousafguda, Hyderabad **...Respondents**

**GENERAL NOTICE**

The public are hereby informed that the above petitioner filed the above I.P.10/ 2024 on the file of the Hon'ble II Addl. Senior Civil Judge Court, at Visakha patnam to declare him as an insolvent and the matter stands posted to **19-04-2024** for hearing. So public are hereby informed that any objections can be raised in the above case before the Hon'ble Court on **19-04-2024** either in person or through an Advocate at **10:30 A.M.**

(By Order of the Hon'ble Court)
**HABEEB SULTAN ALI**
**B. NARASINGA RAO, P. HYMA,**
**B. KAVITHA & G. SYAMALA DEVI**
Advocates, Visakhapatnam,
Cell : 9885355102.

# భీమిలి నియోజకవర్గంలో గంటా ఎన్నికల ప్రచారం

ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న గంటా శ్రీనివాసరావు

ప్రజాశక్తి -యంత్రాంగం

**భీమునిపట్నం :** స్థానిక టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గంటా శ్రీనివాసరావు సోమవారం జివిఎంసి ఒకటో జోన్ పరిధి చిట్టివలస, బాలాజీనగర్ తదితర ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మే నెల 13న జరుగు ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను, విశాఖ లోక్‌సభ అభ్యర్థిగా శ్రీభరత్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. 2014 నుంచి 2019 కాలంలో స్థానిక ఎమ్మెల్యేగా, మంత్రిగా ఉన్న సమయంలో ఈ ప్రాంతానికి తాను చేసిన అభివృద్ధిని చూసి ఓటు వెయ్యాలని కోరారు. వైసిపి అరాచక పాలనకు చరమ గీతం పాడాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నియోజక వర్గ ఇంఛార్జి కోరాడ రాజాబాబు, పార్టీ విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ కార్యదర్శి పిట్టా సురేష్, బిజెపి నియోజక వర్గ కన్వీనర్ కె రామానాయుడు, జనసేన ఒకటో వార్డు అధ్యక్షులు పరిమి భువనేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

**7వ వార్డులో...**

**మధురవాడ :** జివిఎంసి 7వ వార్డులో గంటా శ్రీనివాసరావు ఎన్నికల ప్రచార ర్యాలీ నిర్వహించారు. ముందుగా మానం ఆంజనేయులు నగర్‌లో ఉన్న ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ర్యాలీని ప్రారంభించారు. మల్లయ్యపాలెం, మొగదరమ్మకాలనీ, ఉడా కాలనీల్లో ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా గంటా మాట్లాడుతూ, సూపర్ 6 పథకాల ద్వారా ప్రజలకు మెరుగైన సంక్షేమం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ పిళ్లా మంగమ్మ, వార్డు అధ్యక్షుడు పిళ్లా నరసింగరావు, నాయకులు పిళ్లా వెంకటరావు, జనసేన నాయకులు నాగోతి నర్సింహనాయుడు పాల్గొన్నారు.

**గిడిజాలలో ప్రచారం**

**ఆనందపురం :** ఆనందపురం మండలంలోని గిడిజాల, శొంఠ్యాం, దిబ్బడపాలెం పంచాయతీల్లో భీమిలి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి కోరాడ రాజాబాబు ఆధ్వర్యాన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభ్యర్థి గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ, సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువయ్యే విధంగా కృషిచేస్తానన్నారు. భీమిలి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా శ్రీభరత్‌ను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన ఇన్ఛార్జి పంచకర్ల సందీప్, ఎంపిటిసి అభ్యర్థి తమ్మిన అప్పలరాజు, జి.రమేష్‌బాబు, వానపల్లి ముత్యాలరావు, బొద్దపు శ్రీను, బలిరెడ్డి మల్లికార్జునరావు, చిక్కాల విజయ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## నేరాలు ఘోరాలు

### రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కాన్వెంట్ జంక్షన్‌లో సోమవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు మృతుడు జి.అనిల్ కుమార్ (38) డాక్ యార్డ్ పరిసర ప్రాంతాల్లో పనిచేస్తుంటాడు. స్వగ్రామం పెందుర్తికి వెళ్లే క్రమంలో కాన్వెంట్ జంక్షన్‌లో రోడ్డు దాటుతుండగా లారీ అతన్ని ఢీకొట్టింది. దీంతో అక్కడికక్కడే ఆయన మృతిచెందాడు. హార్బర్ సిఐ దశరథ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని టెక్కలిపాలెం గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు స్థానిక సిఐ పిన్నింటి రమణ తెలిపారు. టెక్కలిపాలెం గ్రామానికి చెందిన కె. దేముడుబాబు తన ఇంటి ముందు మద్యం విక్రయిస్తుండగా దాడి పట్టుకున్నట్లు చెప్పారు. దేముడుబాబు వద్ద నుండి 138 (180 మిల్లీలీటర్లు) క్వార్టర్ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. వాటి విలువ రూ.21,150 ఉంటుందన్నారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

### నాటుసారా శిబిరంపై దాడి

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని పప్పుశెట్టిపాలెం పంచాయతీ జమ్మాదేవిపేట గ్రామ శివారులో సారా తయారీ స్థావరంపై సోమవారం దాడి చేసినట్లు ఎస్సై బి.కృష్ణారావు తెలిపారు. ఈ దాడిలో సారా తయారీకి ఉపయోగించే 300 లీటర్ల బెల్లం పులుపును ధ్వంసం చేశామని చెప్పారు. గ్రామాల్లో నాటుసారా తయారు చేసినా, విక్రయించినా చర్యలు తప్పవని హెచ్చరించారు.



బొత్సకు వినతిపత్రం అందజేస్తున్న భాస్కరరావు తదితరులు

### బొత్సకు అప్సా వినతి

ప్రజాశక్తి -గాజువాక : రాష్ట్ర ప్రయివేట్ పాఠశాలల సంఘం అప్సా నాయకులు సోమవారం రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణను కలిసి కొన్ని సమస్యలపై ఆయన నివాసంలో వినతిపత్రం అందజేశారు. ఇటీవల ప్రభుత్వం బదిలీ ధ్రువపత్రం, స్టడీ సర్టిఫికెట్ లేకుండా ఎవరు ఏ స్కూల్లోనైనా అడ్మిషన్ కావచ్చని ఇచ్చిన జిఒపై చర్చించారు. ఈ జిఒను సవరించాలని కోరారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించి రాష్ట్ర పాఠశాల విద్యా శాఖ కమిషనర్ సురేష్‌కుమార్‌తో ఫోన్‌లో మాట్లాడి ప్రయివేట్ పాఠశాలల యాజమాన్యాలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా జిఒను సవరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఫైనాన్షియల్ సెక్రటరీ పి.భాస్కరరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీనివాస్, సత్యనారాయణ, విశాఖ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ, శ్రీనివాస్, రమేష్ నాయుడు, తదితరులు ఉన్నారు.

### కళింగులతో బొత్స ఆత్మీయ సమావేశం

ప్రజాశక్తి -గాజువాక : జివిఎంసి 87వ వార్డు పరిధి కళింగ వీధిలోని గాజువాక ప్రాంత కళింగ సంక్షేమ సంఘాల ఆధ్వర్యాన సోమవారం బొత్స సత్యనారాయణ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ, బడుగు బలహీన వర్గాల కోసం వైసిపి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందని చెప్పారు. మే 13న జరగనున్న ఎన్నికల్లో వైసిపి తరుపున విశాఖ ఎంపీగా పోటీచేస్తున్న బొత్స ఝాన్సీని, గాజువాక ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్‌ను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్, ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, వియంఆర్‌డిఎ ఛైర్మన్ సనపల చంద్రమౌళి, మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకటరామయ్య, నాయకులు తిప్పల దేవన్‌రెడ్డి, పేడాడ రమణకుమారి, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ పైడి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

### వైభవంగా పునర్వసు హోమం

ప్రజాశక్తి- సింహాచలం : సింహగిరిపై ఉన్న గంగధార సమీపంలోని ఉప ఆలయం రామాలయంలో పునర్వసు హోమం వైభవంగా నిర్వహించినట్లు ఆలయ ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. శ్రీరాముని జన్మ నక్షత్రమైన పునర్వసు పురస్కరించుకొని శ్రీరామ షడక్షరి, సంక్షిప్త రామాయణం పారాయణం చేసినట్లు చెప్పారు.

### గ్రామాల్లో రాములోరి పెళ్లిరాట ఉత్సవాలు

ప్రజాశక్తి -యంత్రాంగం

**పూసపాటిరేగ... నాథం :** శ్రీరామనవమి ఉత్సవాలను పురస్కరించుకొని మండలంలోని పలు గ్రామాల్లో రామాలయాలు ఎదుట పెళ్లిరాట కార్యక్రమాలు సోమవారం వైభవంగా నిర్వహించారు. మద్ది, రెడ్డిపల్లి, అనంతవరం, బి.తాళ్లవలస, కోరాడ తదితర గ్రామాల్లో సీతారాముల కల్యాణ రాటలను వేశారు. మద్ది గ్రామం రామాలయం ఎదుట పెళ్లిరాట ఉత్సవంలో ఎంపిపి రాంబాబు, అనంతవరం గ్రామంలో జి.ఎర్రినాయుడు పాల్గొన్నారు.

**12వ వార్డులో శ్రీరామ నవమి రాట మహోత్సవం..**

**ఆరిలోవ :** శ్రీరామనవమిని పురస్కరించుకొని 12వ వార్డు పెదగదిలి శ్రీకృష్ణ యువజన సేవా సంఘం ఆధ్వర్యాన సోమవారం పందిరి రాట వేశారు. ఈ సందర్భంగా గణపతికి, శ్రీరామచంద్రులకు పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ అధ్యక్షులు కోల బంగారయ్య, పెద్దలు పాల్గొన్నారు.

### వైసిపిలో చేరిక

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలంలోని టిడిపి, జనసేన పార్టీలకు చెందిన 20 ఆర్య వైశ్య కుటుంబాలు సోమవారం వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు సమక్షంలో వైసిపిలో చేరారు. ఆనందపురం వేములవలసకు చెందిన మామిడి శివ, మామిడి కొండారావు, కొట్యాడ రవికుమార్, కొట్యాడ వెంకటరావు, పాలకుర్తి శ్రీనివాసరావు, మామిడి నానాజీ, మామిడి వెంకటరమణ, శ్రీనాదు బాబు, బత్తుల బంగారం, విజ్జపు కిరణ్‌కుమార్ తదితర కుటుంబాలు వైసిపిలో చేరాయి. ఈ కార్యక్రమంలో కోరాడ అప్పలస్వామినాయుడు, మేడిశెట్టి రాంజీ, బంక సత్యం, అప్పలస్వామి, చందక సూరిబాబు, షినగం చిన్న రామారావు పాల్గొన్నారు.

### నూకరాజుకు శ్రీభరత్ పరామర్శ

ప్రజాశక్తి- భీమునిపట్నం : గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ నగరంలోని ప్రయివేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజును సోమవారం పార్టీ విశాఖ లోక్‌సభ అభ్యర్థి ఎం.శ్రీభరత్, భీమిలి నియోజకవర్గ టిడిపి ఇంఛార్జి కోరాడ రాజాబాబు తదితరులు వేర్వేరుగా ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. అతని ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులనడిగి తెలుసుకున్నారు. వేగంగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

## వైభవంగా పోలమాంబ రాట మహోత్సవం

రాట మహోత్సవంలో పాల్గొన్న మేయర్ గొలగాని హరి వెంకట కుమారి

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 9వ వార్డు పరిధి సంజయ్‌గాంధీ కాలనీ గ్రామ దేవత పోలమాంబ అమ్మవారి జాతరను పురస్కరించుకొని సోమవారం అమ్మవారి సదనపు పట్టు, పండగ రాట మహోత్సవాన్ని సోమవారం ఆలయ ధర్మకర్త కంచుమూర్తి నాగరాజు ఆధ్వర్యాన నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు ప్రతాప్ శ్రీతేజశర్మ వేద మంత్రాల మధ్య మేయర్ గొలగాని హరి వెంకట కుమారి రాట వేశారు. వియంఆర్‌డిఎ మాజీ ఛైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు ఒమ్మి రాజు, కార్యదర్శి తాతారావు, ఈశ్వరరావు, హరనాధ్, అప్పారావు, కంచుమూర్తి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## కెమిస్ట్రీ, మైక్రో బయాలజీ విద్యార్థులకు మంచి భవిష్యత్తు

ప్రజాశక్తి -గాజువాక : కెమిస్ట్రీ, మైక్రో బయాలజీ విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉందని అరబిందో ఫార్మా సిఇఒ డాక్టర్ శాతకర్ణి అన్నారు. గాజువాక ఎంవిఆర్ పీజీ అండ్ డిగ్రీ కళాశాలలో ఫార్మాపై కెరియర్ గైడెన్స్ ప్రోగ్రాం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడుతూ, విద్యార్థులు చదువుతోపాటు, ఫార్మాకు సంబంధించిన విషయాలపై అవగాహన కలిగి ఉంటే భవిష్యత్తులో మంచి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. భవిష్యత్తులో ఫార్మా రంగాల్లో మరిన్ని ఉద్యోగ అవకాశాలు వస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ బాలకృష్ణ, ఇంటర్మీడియట్ ప్రిన్సిపల్ ఈశ్వర్‌రాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న శాతకర్ణ

## 'ఉత్తరం'లో అభివృద్ధి చేస్తా : లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి-సీతమ్మధార : ఉత్తర నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని జై భారత్ నేషనల్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి వివి.లక్ష్మీనారాయణ చెప్పారు. జివిఎంసి 24 వార్డులో సోమవారం ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉత్తర నియోజకవర్గంలో కొన్ని సమస్యలతో ప్రజలు ఇబ్బందు ఎదుర్కొంటున్నారని, తాను ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత వాటిని పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జయభారత్ నేషనల్ పార్టీ అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎంఎల్‌టిలో రజిని ప్రథమం

ప్రజాశక్తి-విశాఖపట్నం : ఇంటర్మీడియట్ ఒకేషనల్ కోర్సు మొదటి సంవత్సరంలో రాంబిల్లి కస్తూరిబా గాంధీ బాలిక విద్యాలయం (కెజీబీవీ) విద్యార్థిని సిహెచ్ రజిని (482/500) రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం సాధించారని ఎంఇఒ ఎం.సూర్యారావు, కేజీబీవీ ప్రిన్సిపల్ ప్రమీల తెలిపారు. ప్రతి సంవత్సరమూ తమ కళాశాల విద్యార్థులు మంచి ఉత్తీర్ణతను సాధించి ఉద్యోగాలలో స్థిరపడ్డారని చెప్పారు. ఎంఎల్‌టి మొదటి సంవత్సరంలో 36 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 23 మంది మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన రజినిని ఎంఇఒ సూర్యారావు, కేజీబీవీ ప్రిన్సిపల్ ప్రమీల, అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

## డైట్‌లో ప్రపంచ కళా దినోత్సవం

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ప్రభుత్వ డైట్‌లో సోమవారం ప్రపంచ కళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా డైట్ సీనియర్ అధ్యాపకులు ఎల్.సుధాకర్ మాట్లాడుతూ, ప్రఖ్యాత చిత్రకారుడు లియ నార్డో డావెన్సీ జయంతిని ప్రపంచ కళా దినోత్సవంగా జరుపుకుంటున్నట్లు వివరించారు. అతను వేసిన పలు చిత్రాలు ప్రపంచ చరిత్రను చెబుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు పి.హరిణి, ఎస్.త్రినాథరావు, ఎం.మహాలక్ష్మి, జె.మాధవి, గొట్టేటి రవి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com
విశాఖ, అనకాపల్లి
మంగళవారం 16 ఏప్రిల్ 2024

## కలం మాట

### నీ చైతన్యమే నీకు రక్ష..!

పద్దెనిమిది నిండాక వచ్చేది ఓటు
మనిషిని మహానాయకునిగా నిలిపేది ఓటు,
ప్రపంచ స్వరూపాన్ని
మార్చగలిగే శక్తి ఓటు,
ఎంత సంపన్నుడైనా
ఎంత విద్యాధికుడైనా
ఓటు వేసే వారికి కింకరుడే,
ఓటరు నాడి తెలుసుకుని వారి
అడుగులకు మడుగు లొత్తవలసిందే
భవిష్యత్తుకు భరోసా ఇవ్వవలసిందే..
ఎన్నికలన్నవి మనకొక వరం
ఎందుకంటే
మనం చేసిన తప్పిదాలను
సరిదిద్దుకునే సువర్ణావకాశం
కల్పించే కల్పవృక్షం
మన ఆశలను, ఆశయాలను
నెరవేర్చుకునేందుకు
కలసివచ్చే అద్భుత సమయం.
ఎద ఎదలో దాగిన అభిమానాన్ని
నిరూపించుకునే మంచి తరుణం
ఓటంటే మీట నొక్కడమే కాదు
కోట్లాది జనుల ఊపిరి
మరచిపోకు మిత్రమా
అసమర్థతకు పట్టం కడితే
ఐదేండ్లు ఊడిగం చేయాల్సిందే
నీ చైతన్యమే నీకు రక్ష
లేదంటే అది నీకై నీవు వేసుకునే శిక్ష
నిజం తెలుసుకో
నిజాయితీగా నడుచుకో...

– సీతా సతీష్,
ఉపాధ్యాయుడు, కవి,

## 'ఉత్తరం'లో కెకె.రాజు ప్రచారం

45వ వార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న కెకె.రాజు, కంప హనోక్

**ప్రజాశక్తి–సీతమ్మధార :** జివిఎంసి 45వ వార్డు పరిధి శివశంకర్ రజకుల కాలనీ తదితర ప్రాంతాల్లో కార్పొరేటర్ కంపా హనుక్‌తో కలిసి ఉత్తర నియోజకవర్గ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి కెకె.రాజు సోమవారం మార్నింగ్ వాక్ నిర్వహిస్తూ ప్రచారం చేపట్టారు. స్థానిక ప్రజలతో కొంతసేపు ముచ్చటించారు. వైసిపి ప్రభుత్వ హయాంలో ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను వివరించారు. సంక్షేమ పాలన కొనసాగింపునకు ప్రతి ఒక్కరూ వైసిపి గెలుపునకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ వార్డు అధ్యక్షుడు పైడి రమణ, మాజీ కార్పొరేటర్ సేనాపతి అప్పారావు, బాక్సర్ రాజు, రాయుడు శ్రీను, హరి పట్నాయక్, నేపాల్ శ్రీను, దుర్గ, సన్నీ, గ్రామస్తులు పాల్గొన్నారు.

**25వ వార్డులో ఎన్నికల కార్యాలయం ప్రారంభం**

జివిఎంసి 25వ వార్డు పరిధి సీతమ్మపేట ప్రధాన రహదారిలో కార్పొరేటర్ సారిపల్లి గోవింద్ ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన ఎన్నికల కార్యాలయాన్ని కెకె.రాజు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉత్తర నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు చొక్కాకుల వెంకట్రావు, బాణాల శ్రీనివాసరావు, నాయకులు జివి.రవిరాజు, మువ్వల పోలరావు, జివి.రమణి, పోతు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

**ఆత్మీయ సమావేశం**

మురళీనగర్ జెఆర్.ఫంక్షన్ హాల్‌లో మురళీనగర్, మాధవధార గౌరీ సేవా సంఘం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా కెకె.రాజు హాజరై మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి హయాంలో అన్ని వర్గాల ప్రజలకు సముచిత స్థానం కల్పించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్, మల్ల రమణ, పలమరశెట్టి చిన్న, కె.ప్రతాప్, ఝాన్సీరాణి, పి.సుభాషిణి, యశోద, సుధ, పి.నిర్మల, రేవతీరావు, ఆళ్ల శివగణేష్, బొడ్డేటి కిరణ్, పి.శ్యామ్, కె.సూర్యప్రకాష్, సదరం జ్ఞానేష్, ఎం.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# సార్వత్రిక సంగ్రామం

# విధేయతకు లోగిలి... భీమిలి..!

**చారిత్రక ప్రాధాన్యత ఉన్న భీమిలి నియోజకవర్గానికి జిల్లాలోనే ఓ ప్రత్యేక గుర్తింపు ఉంది. భీమిలి నియోజకవర్గం ఆది నుంచీ విధేయతకు పట్టం కట్టిందని చెప్పొచ్చు. క్షత్రియులు ఎక్కువ కాలం పాటు ఈ నియోజకవర్గానికి ప్రాంతానికి ప్రాతినిధ్యం వహించారు. డచ్, బ్రిటీష్ ప్రభుత్వాలకు ప్రధాన వ్యాపార కేంద్రంగా విలసిల్లిన ప్రాంతంగానే గాకుండా, పాండవులు అజ్ఞాతవాసంలో కొన్నాళ్లు భీమునిపట్నంలో తలదాచుకున్నట్లు పురాణాలు చెబుతున్నాయి. ప్రస్తుతం ఇద్దరు తాజా ఎమ్మెల్యేల మధ్య ప్రధానపోటీతో భీమిలి నియోజకవర్గంపైనే అందరి దృష్టి ఉందనే చెప్పాలి.**

(ప్రజాశక్తి –భీమునిపట్నం)

- తొలి నుంచీ క్షత్రియుల వైపు మొగ్గు
- పునర్విభజన తర్వాత భిన్న ఫలితాలు
- విలక్షణ తీర్పునిస్తున్న భీమిలి ఓటర్లు
- ప్రస్తుతం 'శ్రీనివాస్'ల మధ్యే ప్రధాన పోటీ

**ఇదీ నేపథ్యం...**

స్వాతంత్ర్యం వచ్చాక జరిగిన ఎన్నికల్లో 1952లో స్వతంత్ర అభ్యర్థి కలిగొట్ల సూర్యనారాయణనాయుడు ఎమ్మెల్యేగా విజయం సాధించగా, 1957లో ప్రజా సోషలిస్టు పార్టీ అభ్యర్థి గొట్టుముక్కల జగన్నాథరాజు జయకేతనం ఎగరేశారు. తర్వాత 20 ఏళ్లపాటు ఏకధాటిగా భీమిలి ఓటర్లు కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టారు. 1983లో తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించాక 1999 వరకు వరుసగా ఐదు పర్యాయాలు టిడిపి అప్రతిహత విజయాలు సాధిస్తూ వచ్చింది. టిడిపి తరపున పూసపాటి ఆనందగజపతిరాజు ఒకసారి ఎమ్మెల్యేగా ఎన్నికవ్వగా, ఆ తర్వాత వరుసగా నాలుగుసార్లు ఆర్ఎస్‌డిపి అప్పలనరసింహరాజు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2004లో నియోజకవర్గాల పునర్విభజన తర్వాత క్షత్రియుల ఆధిపత్యానికి గండిపడిందనే చెప్పాలి.

**2004 తర్వాత భిన్నమైన తీర్పులు**

2004 తర్వాత ఓటరు తీర్పు భిన్నంగా మారింది. 2004లో కాంగ్రెస్ అభ్యర్థిగా కర్రి సీతారాం ఎమ్మెల్యేగా గెలిచారు. ఆయన గెలుపుతో దశాబ్దాల క్షత్రియుల ఆధిపత్యానికి తెరపడినట్లు రాజకీయ విశ్లేషకులు అభిప్రాయ పడ్డారు. 2009లో ప్రజారాజ్యం నుంచి ముత్తంశెట్టి శ్రీనివాసరావు (అవంతి శ్రీనివాస్) ఎమ్మెల్యేగా గెలిచారు. అనంతరం ఏర్పడ్డ రాజకీయ పరిణామాల నేపథ్యంలో ప్రజారాజ్యం పార్టీ కాంగ్రెస్‌లో విలీనమైంది. 2014లో టిడిపి నుంచి గంటా శ్రీనివాసరావు ఎమ్మెల్యేగా గెలిచారు.

2019లో వైసిపి తరపున ముత్తంశెట్టి శ్రీనివాసరావు రెండోసారి ఎమ్మెల్యేగా గెలిచారు. తాజాగా 2024 మే 13న జరగనున్న ఎన్నికల్లో వైసిపి తరపున సిట్టింగ్ ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, టిడిపి తరపున 2014లో భీమిలి ఎమ్మెల్యే తరపున గెలిచి, ప్రస్తుతం విశాఖ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఎన్నికల బరిలో ఉన్నారు

### శాసనసభ్యులు వీరే..

1952 :కలిగొట్ల సూర్యనారాయణనాయుడు (స్వతంత్ర)
1957 : గొట్టుముక్కల జగన్నాథరాజు(ప్రజాసోషలిస్టుపార్టీ)
1962 : పివిజి రాజు (కాంగ్రెస్)
1967 : పివిజి రాజు (కాంగ్రెస్)
1972 :ఆర్ఎస్‌డికె సూర్యనారాయణరాజు(కాంగ్రెస్)
1978 : దాట్ల జగన్నాథరాజు (కాంగ్రెస్)
1983 : పూసపాటి ఆనంద గజపతిరాజు (తెలుగుదేశం)
1985 :ఆర్ఎస్‌డిపి అప్పల నరసింహరాజు (తెలుగుదేశం)
1989 : ఆర్ఎస్‌డిపి అప్పలనరసింహరాజు (తెలుగుదేశం)
1994 :ఆర్ఎస్‌డిపి అప్పల నరసింహరాజు (తెలుగుదేశం)
1999 : ఆర్ఎస్‌డిపి అప్పలనరసింహరాజు (తెలుగుదేశం)
2004 : కర్రి సీతారాం (కాంగ్రెస్)
2009 : ముత్తంశెట్టి శ్రీనివాసరావు (ప్రజారాజ్యం)
2014 : గంటా శ్రీనివాసరావు (తెలుగుదేశం)
2019 : ముత్తంశెట్టి శ్రీనివాసరావు (వైసిపి)

**క్షత్రియులకు రా'రాజు'**

భీమిలి నియోజకవర్గం నుంచి నాలుగుసార్లు గెలుపొందిన ఆర్ఎస్‌డిపి అప్పల నరసింహరాజు అరుదైన రికార్డు సొంతం చేసుకున్నారు. 1985లో తొలిసారి ఇక్కడనుంచి బరిలో దిగిన రాజు, 32వేల మెజారిటీతో గెలిచి సత్తా చాటారు. ఆ తర్వాత 1989 లో 29 వేలు,1994లో 26 వేలు,1999లో 24 వేలు ఓట్ల మెజారిటీతో గెలుపొందారు.

అంత వరకూ క్షత్రియులకు కోటగా ఉన్న భీమిలి లో 2004లో తొలి సారి కాపు సామాజిక తరగతి కి చెందిన కర్రి సీతారాం కాంగ్రెస్ తరపున గెలిచి చరిత్ర తిరగ రాశారు. 2009 లో కాంగ్రెస్ పార్టీ తరపున కాపు సామాజిక తరగతికి చెందిన పీలా ఉమారాణి, ప్రజారాజ్యం తరపున అదే సామాజిక తరగతికి చెందిన ముత్తం శెట్టి శ్రీనివాసరావు ఎన్నికల బరిలో నిలిచారు. టిడిపి తరపున ఎన్ ఆర్ ఆంజనేయ రాజు బరిలో నిలిచారు. టిడిపి టిక్కెట్ ఆశించి భంగపడ్డ కాపు సామాజికతరగతికి చెందిన కోరాడ రాజబాబు రెబల్ అభ్యర్థిగా పోటీ చేయగా, 22,953 ఓట్లు వచ్చాయి.ఆ ఎన్నికల్లో ముత్తంశెట్టి శ్రీనివాసరావు 6,310 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. 2014లో వైసిపి అభ్యర్థి కర్రి సీతారాంపై, టిడిపి అభ్యర్థి గంటా శ్రీనివాసరావు 37,366 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు

**విలక్షణ తీర్పులకు వేదిక భీమిలి**

భీమిలి ఓటర్లు అనేక సందర్భాల్లో విలక్షణంగా తీర్పులిచ్చారు. 1985 నుంచి 1999 వరకు టిడిపి తరపున బరిలో నిలిచిన ఆర్ఎస్‌డిపి అప్పల నరసింహరాజు ఎమ్మెల్యేగా గెలుస్తూ వచ్చారు. 2004లో వైఎస్ రాజశేఖరరెడ్డి చరిష్మాతో కాంగ్రెస్ అభ్యర్థి కర్రి సీతారాం, టిడిపి అభ్యర్థి అప్పల నరసింహరాజుపై కేవలం 241ఓట్ల మెజారిటీతో గెలిచారు. 2009 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ పట్ల విముఖత చూపిన ఓటర్లు ప్రజారాజ్యం పార్టీని ఆదరించారు. పిఆర్‌పి అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ప్రత్యర్థి టిడిపి అభ్యర్థి ఆంజనేయరాజుపై గెలిచారు. 2014లో టిడిపి నుంచి గంటా శ్రీనివాసరావు అత్యధిక మెజారిటీతో గెలిచారు. 2019లో వైసిపి నుంచి ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఎమ్మెల్యేగా గెలిచారు.

### రికార్డుల రా'రాజు'

అప్పలనర్సింహరాజు

భీమిలి నియోజకవర్గం నుంచి నాలుగుసార్లు గెలుపొందిన ఆర్ఎస్‌డిపి అప్పల నరసింహరాజు అరుదైన రికార్డు సొంతం చేసుకున్నారు. 1985లో తొలిసారి ఇక్కడనుంచి బరిలో దిగిన రాజు, 32వేల మెజారిటీతో గెలిచి సత్తా చాటారు. ఆ తర్వాత 1989 లో 29 వేలు,1994లో 26 వేలు,1999లో 24 వేలు ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. అంతకుముందు 1983లో టిడిపి తరపున ఎమ్మెల్యేగా ఆనందగజపతిరాజు విజయం సాధించారు.

ఆనందగజపతిరాజు

### పునర్విభజనకు ముందు.. తర్వాత

2009 ఎన్నికలకు ముందు వరకు నియోజక వర్గ భౌగోళిక స్వరూపం ఇలా ఉండేది.భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాల తో పాటు పక్కనే ఉన్న విజయనగరం జిల్లాకు చెందిన జామి, డెంకాడ, గంట్యాడ, లక్కవరపుకోట మండలాలతో పాటు విజయనగరం గ్రామీణ మండలానికి చెందిన కొన్ని గ్రామాలు ఉండేవి. పునర్విభజన అనంతరం విజయనగరం జిల్లాలోని మండలలాలను తొలగించారు. పునర్విభజన తర్వాత భీమిలి,ఆనందపురం, పద్మనాభం మండలాలు, విశాఖ రూరల్ మండలంలోని పలు ప్రాంతాలు, ఎల్లపు వాని పాలెం, అడివివరం, సింహాచలం,పరదేశిపాలెం, మారికి వలస, కొమ్మది, బక్కన్నపాలెం, పిఎం పాలెం, చంద్రంపాలెం, మధురవాడ, పోతిన మల్లయ్య పాలెం, ఎండాడ, సాగర్‌నగర్, రుషికొండ ప్రాంతాలకు విస్తరించింది.

### శ్రీనివాస్‌ల మధ్య తాజాగా ప్రధాన పోటీ

భీమిలి నియోజకవర్గంలో 2024 సార్వత్రిక ఎన్నికలూ ప్రతిష్టాత్మకంగా మారనున్నాయి. ప్రస్తుత అసెంబ్లీలో ఎమ్మెల్యేలుగా ఉన్న అభ్యర్థులిద్దరూ ప్రధాన పార్టీల తరపున పోటీ బరిలో ఉన్నారు. వీరిలో ప్రస్తుత భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అధికార వైసిపి తరపున బరిలో దిగుతుండగా, ప్రధాన ప్రతిపక్షం టిడిపి అభ్యర్థిగా కూటమి బలపరిచిన గంటా శ్రీనివాసరావు పోటీలో ఉన్నారు. గంటా ప్రస్తుతం విశాఖ ఉత్తర ఎమ్మెల్యే కావడం ఒక విశేషమైతే, భీమిలిలో పోటీలో ఉన్న ప్రధాన పార్టీల అభ్యర్థులిద్దరూ ఈ స్థానం నుంచి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించిన వారు కావడం విశేషం. అయితే భీమిలి ఓటర్లు ఎవరికి పట్టంకడతారనేది ఆసక్తికరంగా ఉంది.



## విస్తృతంగా సిపిఎం ఎన్నికల ప్రచారం

జింక్ గ్రౌండ్‌లో వాకర్స్‌ను కలిసి ప్రచారం నిర్వహిస్తున్న ఎం.జగ్గునాయుడు

**ప్రజాశక్తి –గాజువాక :** ఇండియా ఫోరం బలపరిచిన సిపిఎం గాజువాక నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి ఎం.జగ్గునాయుడు సోమవారం విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సోమవారం ఉదయం జింక్ గేట్‌లో వాకర్స్‌ను కలిసి మాట్లాడారు. ఓటు వేయాలని కోరారు. తర్వాత 65వ వార్డు పరిధి బానోజీతోట, వాంబే కాలనీ ఏరియాలో ప్రచారం చేపట్టారు. భవన నిర్మాణ కార్మిక సమస్యలపై అనేక పోరాటాలు చేసిన చరిత్ర తమకు ఉందని చెప్పారు. బానోజీ తోటను ఆనుకొని ఉన్న సర్వేనెంబర్ 274లో పేదలకు స్థలాలు ఇవ్వాలని జరిగిన పోరాటంలో జైలుకెళ్లిన విషయాన్ని గుర్తు చేశారు. పేదల పక్షాన పోరాడే సిపిఎం అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను గెలిపించాలని కోరారు. తర్వాత 67వ వార్డు జోగవానిపాలెంలో, సాయిరాంనగర్, సంతోష్‌నగర్ ఏరియాలో ప్రచారం నిర్వహించారు. గాజువాక హౌస్ కమిటీ సమస్యపై ఎక్కువగా పోరాటం, పాదయాత్రలు సిపిఎం చేసిన విషయాన్ని గుర్తుచేశారు. 69, 70 వార్డుల్లో కూడా ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో సిపిఎం నాయకులు ఎం.రాంబాబు, డి.రమణ, నాగేశ్వరరావు, కిరీటం, సంతోషం, నర్సింగరావు, లోకేష్, అప్పారావు పాల్గొన్నారు.

## 2వ వార్డులో ముత్తంశెట్టి ఎన్నికల ప్రచారం


బ్రోచర్‌ను అందజేస్తున్న ముత్తంశెట్టి శ్రీనివాసరావు

**ప్రజాశక్తి –తగరపువలస :** జివిఎంసి రెండో వార్డు పరిధి సంగివలస, సంగివలస కాలనీ, నమ్మివానిపేట తదితర ప్రాంతాల్లో సోమవారం వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. 'మా నమ్మకం నువ్వే జగన్', 'భీమిలి నియోజక వర్గ సమగ్రాభి వృద్ధి నా అజెండా' పేరుతో ముద్రించిన బ్రోచర్లను ఇంటింటికీ వెళ్లి ఆయన అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన ఎన్నికల ప్రచార సభల్లో ఆయన మాట్లాడుతూ, ఇప్పటికే తన హయాంలో నియోజకవర్గంలో ఎంతగానో అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. కులమతాలకు, రాజకీయాలకతీతంగా సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందించామని వివరించారు.

## బిజెపి, దాని మద్దతు పార్టీలను ఓడించి
# కమ్యూనిస్టులను గెలిపించండి

**భారత్ బచావో జాతీయ ఉపాధ్యక్షులు డాక్టర్ ఎంఎఫ్ గోపీనాథ్**

మాట్లాడుతున్న భారత్ బచావో జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ గోపీనాథ్

**ప్రజాశక్తి– విశాఖ కలెక్టరేట్:** దేశ సంపదను గుజరాత్ కార్పొరేట్లకు కట్టబెడుతున్న బిజెపి, దానితో జతకట్టిన పార్టీలను ఓడించి, ఇండియా కూటమిని, కమ్యూనిస్టులను గెలిపించాలని భారత్ బచావో జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎంఎఫ్ గోపీనాథ్ విజ్ఞప్తి చేశారు. విశాఖ పర్యటనకు విచ్చేసిన గోపీనాథ్, సోమవారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశంలో మాట్లాడుతూ, సంక్షోభంలో దేశం, ప్రమాదంలో రాజ్యాంగం ఉన్న నేపథ్యంలో భారత బచావో (దేశాన్ని రక్షించుకుందాం) ఏర్పడి దేశవ్యాప్తంగా పని చేస్తున్నదన్నారు. ఏప్రిల్ 14న వరల్డ్ నాలెడ్జ్ డేగా ఐక్యరాజ్యసమితి ప్రకటించిందని, దానికి అనుగుణంగానే దేశ రక్షణ లక్ష్యంగా 2022 నుంచి తమ సంస్థ పని చేస్తోందన్నారు. .రాజ్యాంగ రక్షణ ద్వారానే దేశ రక్షణ సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. మణిపూర్, రాజస్థాన్, కర్నాటక రాష్ట్రాల్లో బిజెపి మతోన్మాద విధానాల వలన అలజడి మొదలైందన్నారు. ఈ తరుణంలో దేశ భవిష్యత్తు కోసం బిజెపి కూటమిని ఓడించి, ఇండియా కూటమిని గెలిపించాలని కోరారు. బిజెపి పాలనలో ఫాసిజం నెపంతో అగ్రవర్ణాల పెత్తనం పెరుగుతోందన్నారు. ఒకపక్క స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ చేస్తున్నారని మండిపడ్డారు .గత పదేళ్లలో ఒక్క ప్రభుత్వరంగ సంస్థను నెలకొల్పని బిజెపి ప్రభుత్వం, దేశ సంపద గుజరాతీ మార్వాడీ చేతుల్లోకి వెళ్లేలా చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.

సంస్థ ఉపాధ్యక్షురాలు గూడూరు సీతామహాలక్ష్మి మాట్లాడుతూ, దేశాన్ని కార్పొరేట్ దోపిడీ నుంచి కాపాడి, మానవ హక్కుల రక్షణకు భారత్ బచావో సంస్థ కృషి చేస్తుందన్నారు. బిజెపి, ఆర్ఎస్ఎస్ సంకెళ్ళ నుంచి దేశ రక్షణ కోసం కృషి చేస్తామన్నారు సమావేశంలో భారత్ బచావో జిల్లా అధ్యక్షుడు ఎస్.ఆర్ వేమన,జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ పి.శ్రీనివాస్, జిల్లా కమిటీ సభ్యులు కన్యాకుమారి, ఎస్.సుధాకర్, వేణు పాల్గొన్నారు.

## ఎన్నికల వ్యయ లావాదేవీలకు పక్కా రిజిస్టర్లు నిర్వహించాలి

రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఇఆర్ఒ మయూర్ అశోక్

**ప్రజాశక్తి–విశాఖపట్టణం :** పోటీ అభ్యర్థులు ఎన్నికల వ్యయానికి సంబంధించి పక్కా రిజిస్టర్లు నిర్వహించాలని తూర్పు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ కె. మయూర్‌అశోక్ అన్నారు. నామినేషన్లు వేసిన రోజు నుంచి అభ్యర్థుల ఖాతాల్లో వ్యయ వివరాలను నమోదు చేస్తామని వెల్లడించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ మీటింగ్ హాలులో తూర్పు నియోజకవర్గ రాజకీయప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 18న నోటిఫికేషన్ల విడుదలైనప్పటి నుంచి పూర్తి స్థాయి ఎన్నికల ప్రక్రియ మొదలవుతుందన్నారు. ఎన్నికల నిర్వహణ, నామినేషన్లు, ప్రచారాలకు సంబంధించిన ప్రతి అంశంపైనా రాజకీయ పార్టీల ప్రతినిధులు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. నిబంధనల మేరకు అనుమతులు తీసుకుని ప్రచారాలు నిర్వహించాలన్నారు. అభ్యర్థులు తాజాగా బ్యాంకు ఖాతా తెరిచి, దాని ద్వారానే ఎన్నికల వ్యయ లావాదేవీలు జరపాలని స్పష్టం చేశారు. క్రిమినల్ కేసులున్న వారు సంబంధిత వివరాలతో మూడుసార్లు పత్రికల్లో ప్రకటన ఇవ్వాలన్నారు. నామినేషన్ ధరావత్తు రూ.10వేలు చెల్లించాలని, ఎస్‌సి, ఎస్‌టి అభ్యర్థులకు రూ.5వేలు రాయితీ ఉంటుందన్నారు. నామినేషన్ పత్రాలలో తప్పులు దొర్లకుండా అన్ని వివరాలను సక్రమంగా పూరించాలని, సరిచూసు కోవాలని సూచించారు.

మే ఒకటో తేదీన ఇవిఎంల రెండో విడత ర్యాండమైజేషన్ జరుగుతుందని, 5, 6వ తేదీల్లో రెండో విడత శిక్షణలు ఉంటుందని రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరించారు. వచ్చేనెల 13న పోలింగ్ రోజున ఉదయం 5.30 గంటలకే పోలింగ్ ఏజెంట్లు కేంద్రానికి చేరుకోవాలని, 7.30 గంటల లోపు మాక్ పోలింగ్ జరుగుతుందని స్పష్టం చేశారు.ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు సహకరించాలని కోరారు. సమావేశంలో తూర్పు నియోజకవర్గ ఎన్నికల అధికారులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

బత్తుల తాతయ్యబాబును సత్కరిస్తున్న టిడిపి కార్యకర్తలు

## టిడిపి అనకాపల్లి పార్లమెంట్ అధ్యక్షులుగా బత్తుల

**ప్రజాశక్తి -బుచ్చయ్యపేట**

తెలుగుదేశం పార్టీ అనకాపల్లి పార్లమెంట్ అధ్యక్షుడిగా చోడవరం టిడిపి ఇన్‌ఛార్జి బత్తుల తాతయ్యబాబు నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు ఉత్తర్వులు జారీ చేశారు. బుచ్చయ్యపేట మండలానికి చెందిన తాతయ్యబాబు మూడున్నరేళ్ల పాటు చోడవరం టిడిపి ఇన్చార్జిగా పనిచేశారు. చోడవరం అసెంబ్లీ టిడిపి సీటు ఆశించారు. ప్రత్యేక పరిస్థితుల్లో పార్టీ మాజీ ఎమ్మెల్యే రాజుకి ఈ టికెట్ కేటాయించింది. ఈ నేపథ్యంలో తాతయ్యబాబుకు పార్లమెంట్ అధ్యక్ష పదవి కట్టబెట్టింది. దీంతో సోమవారం మండలంలోని పలువురు నాయకులు, కార్యకర్తలు తాతయ్యబాబును సత్కరించారు.

## మహిళా గర్జన సభ

**ప్రజాశక్తి-అనకాపల్లి** : మండలంలోని ఎల్లారమ్మ కాలనీలో సోమవారం మహిళా గర్జన బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా అనకాపల్లి జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఉపాధి అవకాశాలు మెరుగుపరుస్తామని చెప్పారు. ఆయా ప్రాంతాల్లో మహిళలకు కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఎంపీ అభ్యర్థి తనయుడు రుత్విక్ మాట్లాడుతూ అనకాపల్లి లో నిరుద్యోగం యువత చాలా ఎక్కువగా ఉన్నదన్నారు. కూటమి ప్రభుత్వాన్ని ఏర్పడితే నిరుద్యోగులకు మంచి ఉపాధి అవకాశాలు దొరుకుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం, బిజెపి, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉచిత కంటి వైద్య శిబిరం

**ప్రజాశక్తి-కె.కోటపాడు** : మండలంలోని చౌడువాడ రామాలయం వద్ద సోమవారం అనకాపల్లి జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యతో శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో 72 మంది కంటి రోగులు పరీక్షలు చేయించుకోగా అందులో 30 మందిని కంటి ఆపరేషన్‌కు ఎంపిక చేసి శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రికి తరలించారు. ఈ సందర్భంగా శంకర్ ఫౌండేషన్ ఆప్తాలమిక్ ఆఫీసర్ దుర్గా భవాని మాట్లాడుతూ కంటి నరాల చికిత్స, కంటి పైపొర చికిత్స, కంటి నీటి కాసుల చికిత్స, కంటి రెప్పల చికిత్సతోపాటు చిన్నపిల్లల కంటి చికిత్స కొరకు తమ ఆసుపత్రిలో ప్రముఖ వైద్యుల ద్వారా చికిత్స చేయడానికి రిఫర్ చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి దాడి ఎరుకునాయుడు, శంకర్ ఫౌండేషన్ క్యాంపు కోఆర్డినేటర్ సిహెచ్.అశ్వని కుమార్, నర్సింగ స్టాఫ్ గంగమ్మ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## ఎంపిపి పదవికి కిలపర్తి రాజేశ్వరి రాజీనామా

**ప్రజాశక్తి-దేవరాపల్లి** : మాడుగుల నియోజకవర్గం వైసీపీకి పెద్ద షాక్ తగిలింది. ఉప ముఖ్యమంత్రి, వైసిపి అనకాపల్లి ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాల నాయుడు సొంత మండలం దేవరాపల్లి ఎంపీపీ పదవికి వైసిపికి చెందిన కిలపర్తి రాజేశ్వరి సోమవారం రాజీనామా చేశారు. ఆమె తన రాజీనామా పత్రాన్ని ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్తు సీఈవో ఎం.పోలినాయుడుకు అందజేశారు. రాజేశ్వరి, భర్త వైసిపి జిల్లా ఉపాధ్యక్షుడు కిలపర్తి భాస్కరరావుతో కలిసి ఆమె సీఈఓను కలిసి తన రాజీనామాను ఆమోదించాల్సిందిగా కోరారు. ఎంపీపీ పదవికి కిలపర్తి రాజేశ్వరి రాజీనామా చేసినట్లు సీఈఓ ధ్రువీకరించారు.

జెడ్‌పి సిఇఒకు రాజీనామా పత్రం అందిస్తున్న రాజేశ్వరి

# స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ అనుకూల పార్టీలకు బుద్ధి చెప్పాలి

### రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

**ప్రజాశక్తి- అనకాపల్లి**

విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు అనుకూలంగా ఉన్న పార్టీలకు మే 13న జరిగే ఎన్నికలలో తగిన బుద్ధి చెప్పాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. స్థానిక వై విజయకుమార్ సమావేశ మందిరంలో ఎఐటియుసి ఆధ్వర్యాన సోమవారం రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఇండియా కూటమిను గెలిపిద్దాం - స్టీల్ ప్లాంట్‌ను కాపాడుకుందాం అనే అంశంపై ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి రాజాన దొరబాబు అధ్యక్షతన జరిగిన ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో పెంటకోట సత్యనారాయణ (ఎఐటియుసి), రుత్తల శంకరరావు (సీఐటీయూ), సిహెచ్ రాంబాబు (ఏఐఎఫ్‌టీయు) బాలు గాడి (రైతు స్వరాజ వేదిక) బూసి పరమేశ్వరి (మహిళా సమాఖ్య), సాయి లక్ష్మణ్ (బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్) తదితరులు మాట్లాడారు. ఏన్నో త్యాగాలతో సాధించుకున్న విశాఖ స్టీల్‌ప్లాంట్‌ని మోడీ ప్రభుత్వం ప్రైవేటీకరణకు పూనుకుందని తెలిపారు. స్టీల్‌ప్లాంట్, విభజన హామీల విషయంలో రాష్ట్ర ప్రజలను మోసం చేసిన బిజెపితో టిడిపి, జనసేన పొత్తు ఎందుకు పెట్టుకున్నాయని ప్రశ్నించారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణపై రాజ్యసభలో ఒక్కసారి కూడా మాట్లాడని సీఎం రమేష్ ఇప్పుడు తనను ఎంపీగా గెలిపిస్తే అనకాపల్లికి మేలు చేస్తానని చెప్పడం మోసపూరితమన్నారు. సీఎం రమేష్‌ను ఎంపీగా ఓడించి మోడీకి బుద్ధి చెప్పాలని కార్మికులకు పిలుపునిచ్చారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ విషయంలో ముఖ్యమంత్రి జగన్ కూడా కార్మికులను మోసగిస్తున్నారని విమర్శించారు. ఈ సమావేశంలో వివిధ సంఘాల ప్రతినిధులు ఎం.అప్పలరాజు, కె.త్రినాధ్, కోన లక్ష్మణ్, మొల్లేటి కొండలరావు, చిన్ని యాదవ్, కోరిబిల్లి శంకరరావు, ప్రసాద్, వీరచారి దేముడుబాబు, బాబ్జీ, కన్నబాబు, వియ్యపు రాజు, నరాలశెట్టి సత్యనారాయణ, పోతురాజు తదితరాలు పాల్గొన్నారు.

రౌండుటేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న ఎఐటియుసి నేత దొరబాబు

### డిఆర్‌డిఒ గోడ నిర్మాణంలో

## నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలి

**ప్రజాశక్తి-యలమంచిలి** : ఎన్ఏఓబి అనుబంధ సంస్థ డిఆర్‌డిఒ చేపట్టిన గోడ నిర్మాణం వల్ల పోగొట్టుకున్న ఆస్తులకు నష్టపరిహారం చెల్లిస్తామని ఇచ్చిన హామీ ప్రకారం వెంటనే చెల్లించాలని పెదకలవలాపల్లి నిర్వాసితులు జిల్లా కలెక్టరు రవి పట్టన్‌శెట్టికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు నిర్వాసితులంతా రావి దేముళ్ల ఆధ్వర్యంలో సోమవారం యలమంచిలి డిగ్రీ కాలేజీలో ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లు పరిశీలనకు వచ్చిన జిల్లా కలెక్టర్‌ను కలిసి తమ గోడు వెళ్లబుచ్చుకున్నారు. డిఆర్‌డిఒ సంస్థ చేపట్టిన రక్షణ గోడ నిర్మాణంలో తాము పెంచుకున్న చెట్లు, నిర్మించుకన్న పశువుల పాకలు, బోరు వెల్స్ కోల్పోయామని తెలిపారు. పోగొట్టుకున్న స్థలాలకు ప్రత్యామ్నాయంగా వేరేచోట స్థలాలిస్తామని, నష్టపోయిన ఆస్తులకు నష్టపరిహారం చెల్లిస్తామన్నారని చెప్పారు. కాని ఇంతవరకు వాటిని చెల్లించలేదని, దయతో వాటిని వెంటనే నిర్వాసితులకు అందేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో బాధితులు ఎస్. నాగేశ్వరి, కె. అప్పల నర్స, రావి జయమ్మ, రావి మంగ, రావి లక్ష్మి, విరోది రత్న, రమణమ్మ పాల్గొన్నారు.

జిల్లా కలెక్టర్ రవికి వినతి ఇస్తున్న పెదకలవలాపల్లి బాధితులు

## అలరించిన లాఫింగ్ క్లబ్ హాస్యవల్లరి

**ప్రజాశక్తి-అనకాపల్లి**

స్థానిక వైఎంవిఎ శ్రీధరాల వెంకటరమణ హాల్‌లో లాఫింగ్ క్లబ్ ఆధ్వర్యాన సోమవారం జరిగిన హాస్యవల్లరి కార్యక్రమం ప్రేక్షకులను అత్యంత రసరమ్యంగా అలరించింది. కార్యక్రమం విజయబాబు మాస్టర్ ఈల పాటతో ప్రారంభమైంది. విశాఖపట్నం ఏఏఏ ఎంటర్టైన్మెంట్స్ ఆధ్వర్యంలో పి.ప్రవీణ్ కుమార్, సిహెచ్. నాగార్జున, ప్రావీణ్య, హిమ, ఏ నాగరాజు చే 'హాస్యంతో అల్లరి' కామెడీ షో ప్రేక్షకులను నవ్వుల వీనుల విందు చేసింది. అనంతరం కార్యక్రమం ముఖ్య ప్రోత్సాహకులు సత్యనారాయణ స్వామి వారి దేవస్థానం మాజీ చైర్మన్ ధనాల విష్ణు చౌదరి, ముఖ్య అతిథులు కొణతాల వెంకటరావు, కొణతాల పూర్ణచంద్రరావు, కాండ్రేగుల సూరి సత్యనారాయణ, కాండ్రేగుల సత్యనారాయణ చేతుల మీదగా ఆత్మీయ చిరు సత్కారం చేశారు. ఈ కార్యక్రమంలో లాఫింగ్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు దాడి వాసు, బొడ్డేడ మురళి, వినకోట బుచ్చిరాజు, రాపేటి నారాయణరావు, ఆళ్ళ సూరిబాబు, బొడ్డేడ రాజేష్, బుద్ధ శ్రీనివాసరావు, ధావన్, పేకేటి శ్రీనివాసరావు, బీరా వినోద్ కుమార్, పి.రమణబాబు, కర్రి సత్యనారాయణ, భీశెట్టి తిరుమల, పీలా హరి, పెంటకోట చందర్రావు పాల్గొన్నారు.

## వైసిపి పాలనలో అంతులేని అవినీతి

మాట్లాడుతున్న మాజీ మంత్రి దాడి వీరభద్రరావు

**ప్రజాశక్తి-అనకాపల్లి** : గడిచిన ఐదేళ్ల వైసీపీ పాలనలో అవినీతి, అక్రమాలే ఎజెండాగా పాలన సాగించారని, అభివృద్ధి ఎక్కడా కానరాలేదని మాజీ మంత్రులు దాడి వీరభద్రరావు, కొణతాల రామకృష్ణ ఆరోపించారు. స్థానిక గవరపాలెం వివి.రమణ రైతు భారతి కళ్యాణ మండపంలో సోమవారం మాజీ మంత్రి దాడి వీరభద్రరావు అభిమానుల ఆత్మీయ సమావేశం దాడి రత్నాకర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వీరభద్రరావు మాట్లాడుతూ గతంలో అనకాపల్లి నుంచి ఎమ్మెల్యేగా గుడివాడ అమర్నాథ్‌ను గెలిపించి చాలా పెద్ద తప్పు చేశామన్నారు. అమర్నాథ్ హయాంలో అనకాపల్లి నియోజకవర్గంలో ఎన్నడూ లేనంత రీతిలో రూ.500 కోట్లు అవినీతి జరిగిందన్నారు. ఎక్కడో విదేశాల్లో ఉండే వ్యక్తి వద్ద నుంచి డబ్బులు తీసుకొని వైసీపీ ఎమ్మెల్యే టిక్కెట్ ఇచ్చిందని, అటువంటి వ్యక్తిని గెలిపిస్తే మరలా అమర్నాథ్ అండ్ కంపెనీ పాలనే చూడాల్సి వస్తుందని చెప్పారు. కొణతాల రామకృష్ణ మంచి కుటుంబ నేపథ్యం కలిగిన వ్యక్తి అని తెలిపారు. జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ 40 ఏళ్ల తరువాత దాడి కుటుంబంతో కలిసి పని చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ సమావేశంలో ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, దాడి జయవీర్, సీఎం రిత్విక్, మళ్ల రాజా, బొడ్డపాటి చినరాజారావు, తమ్మన సుబ్బారావు, పెద్ద సంఖ్యలో దాడి అభిమానులు, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

## ముఖ్య నాయకులతో బూడి సమావేశం

**ప్రజాశక్తి-దేవరాపల్లి**

అనకాపల్లి పార్లమెంట్ వైసిపి అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు, మాడుగుల ఎమ్మెల్యే అభ్యర్థి ఈర్లె అనురాధ ఆదివారం రాత్రి స్థానిక వైసిపి నాయకులు లలితా నాయుడు ఇంటి ఆవరణలో పార్టీ ముఖ్య నాయకులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బూడి మాట్లాడుతూ వైసిపి గడిచిన ఐదేళ్లలో ప్రతి కుటుంబానికీ సంక్షేమ పథకాలు అందించిందని, ఓట్లు అడిగే హక్కు వైసిపికి మాత్రమే ఉందని చెప్పారు. బిజెపి ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్ ఎన్నికల తరువాత ఎవరికీ కనిపించరని, టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి పైలా ప్రసాద్‌రావు అమెరికా వ్యాపారం చేసుకోవడానికి వెళ్ళిపోతారని, అందుబాటులో ఉండే తనను, తన కుమార్తె అనురాధను ఎంపీ, ఎమ్మెల్యేలుగా గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో జెడ్పిటిసి కర్రి సత్యం, వైసిపి మండల అధ్యక్షులు బూరె బాబురావు, సీనియర్ నాయకులు గండిపడాల అప్పలరాజు, గుండు రాంబాబు, కెవి రమణ పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

**ప్రజాశక్తి- సబ్బవరం** : అగ్ని ప్రమాదాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సబ్బవరం అగ్నిమాపక శాఖ అధికారి జీవీ సత్యరాజు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా సోమవారం స్థానిక ఎన్టీఆర్ సర్కిల్ వద్ద ప్రజలకు, గృహ సముదాయాలు, వ్యాపార భవనములు, గ్రామీణ ప్రాంతాల్లో జరిగే అగ్ని ప్రమాదాలు - నివారణ చర్యలు గురించి అవగాహన కల్పించారు. మాక్ డ్రిల్ నిర్వహించారు. కరపత్రాలను ప్రజలకు, షాపులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎల్ఎఫ్ కె.అప్పలనాయుడు, డిఓపి పి అప్పారావు, ఎఫ్ఎం టి.వెంకటరావు, హెచ్‌జి బి ఉదయ్ కుమార్, హెచ్‌జి సిహెచ్ఎ బెనహర్ తదితరులు పాల్గొన్నారు.

**చోడవరం రూరల్** : చోడవరం మండలంలో అగ్నిమాపక సిబ్బందితో రిలయన్స్ స్మార్ట్ పాయింట్‌లో అక్కడున్న సిబ్బందితో అగ్ని మాపక వారోత్సవాలు నిర్వహించారు. అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి సిబ్బందికి అవగాహన కల్పించారు. అగ్నిమాపక వారోత్సవాలు భాగంగా ఈనెల 20వ తేదీ వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు స్టేషన్ ఫైర్ ఆఫీసర్ బివి రామస్వామి తెలిపారు. ఈ కార్యక్రమంలో రిలయన్స్ స్మార్ట్ పాయింట్ సిబ్బంది, ఫైర్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

**తగరపువలస** : స్థానిక జంక్షన్‌లో అగ్నిప్రమాదాల నివారణపై చిట్టివలస అగ్ని మాపక అధికారి జి.శ్రీనివాసరాజు ఆధ్వర్యాన సిబ్బంది సోమవారం ప్రజలకు అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాలు జరిగితే తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తదితరాలను ప్రయోగాత్మకంగా ప్రదర్శించారు. వ్యాపార సముదాయాల వద్ద తగినంత నీరు, ఇతర అగ్ని మాపక సాధనాలను అందుబాటులో ఉంచుకోవాలని, మెట్ల మార్గంలో ఎటువంటి సామగ్రి ఉంచరాదని, పాతబడిన స్విచ్‌లు, విద్యుత్ వైర్లను వాడ రాదని అగ్ని మాపక అధికారి శ్రీనివాసరాజు స్థానికులకు సూచించారు. అగ్ని ప్రమాదాల నివారణ చర్యలపై అవగాహన కల్పిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు.

# టిడిపి హయాంలో దోపిడీ

-ఎమ్మెల్యే పెట్ల గణేష్

-ముమ్మరంగా ప్రచారం

**ప్రజాశక్తి-అనకాపల్లిడెస్క్:**రాష్ట్రాన్ని దోచుకున్న దోపిడీ దొంగలు చంద్రబాబు, అయ్యన్నపాత్రుడులు అని నర్సీపట్నం సిట్టింగ్ ఎమ్మెల్యే, వైసిపి అభ్యర్థి పెట్ల ఉమాశంకర్ గణేష్ ఆరోపించారు. సోమవారం నర్సీపట్నం మున్సిపాలిటీ 22వ వార్డులో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, నర్సీపట్నం నియోజకవర్గంలో గ్రావెల్, లేటరైట్, రంగురాళ్ల దందాలతో వందల కోట్లు దోచుకున్న దోపిడీ దొంగలు అయ్యన్నపాత్రుడు, వారి కుమారుడు విజయ్ అని ఆరోపించారు. అయ్యన్నపాత్రుడు లేటరైట్ ద్వారా రాజమండ్రికి చెందిన ఒక కంపెనీ వద్ద సుమారు రూ.20 కోట్లు దోచుకున్నారన్నారు. రంగురాళ్ల వ్యాపారస్తులను భయపెట్టి వీళ్లే దోచుకున్నారని విమర్శించారు. దీన్ని ప్రజలందరూ గమనించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ లు చింతకాయల సన్యాసిపాత్రుడు(జమీలు), గొలుసు నరసింహమూర్తి, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ గుడబండి ఆదిలక్ష్మి, వార్డు ఇన్‌చార్జ్ అప్పలనాయుడు, రాంగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు హారతి ఇస్తున్న మహిళ

కండువా వేస్తున్న అనిత

## టిడిపిలో పలువురు చేరిక

**ప్రజాశక్తి-నక్కపల్లి:**మండలంలో మత్స్యకార గ్రామమైన రాజయ్యపేటకు చెందిన ఎరిపల్లి రమణమ్మ, బంగారి దంపతులు టిడిపిలో చేరారు.ఈ మేరకు సోమవారం నక్కపల్లి క్రిష్ టౌన్ షిప్‌లో కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వంగలపూడి అనిత వారికి పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా అనిత మాట్లాడుతూ, నియోజకవర్గంలో పలు గ్రామాల నుండి పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు చేరుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్, జిల్లా పరిషత్ కో ఆప్షన్ మాజీ సభ్యులు కొప్పిశెట్టి కొండబాబు, నాయకులు కొప్పిశెట్టి బుజ్జి, పిక్కి సత్తియ్య తదితరులు పాల్గొన్నారు.

**భీమునిపట్నం :** స్థానిక టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గంటా శ్రీనివాసరావు సమక్షంలో మండలంలోని రేఖవానిపాలెం పంచాయతీకి చెందిన పలువురు వార్డు మెంబర్లు సోమవారం స్థానిక క్యాంప్ కార్యాలయంలో టిడిపిలో చేరారు. 3, 8వ వార్డు సభ్యులతో పాటు దాదాపు 30 మంది గంటా సమక్షంలో టిడిపిలో చేరినట్లు మాజీ ఎంపిపి యరబాల కృష్ణవేణి, పార్టీ మండల అధ్యక్షులు డిఎస్.రాజు తెలిపారు. వారికి కండువా వేసి పార్టీలోకి గంటా ఆహ్వానించారు.

ఎరువులు వేస్తున్న కార్మికులు

సంపద తయారీ కేంద్రాల్లో..

## వర్మీ కంపోస్టు తయారీకి శ్రీకారం

- ప్రజాశక్తి కథనానికి స్పందన

**ప్రజాశక్తి-కోటవురట్ల:**నిరుపయోగంగానున్న సంపద తయారీ కేంద్రాల పేరుతో శుక్రవారం ప్రజాశక్తిలో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. బికెపల్లి, ఎండపల్లి గ్రామాలలో సోమవారం బికెపల్లి కార్యదర్శి సంతోషి, ఎండపల్లి కార్యదర్శి నరసింహ సంపద తయారీ కేంద్రాలకు పశువుల ఎరువులు తరలించి వర్మి కంపోస్టు తయారీకి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సంపద తయారీ కేంద్రాల వద్ద కంపోస్టు ఎరువుల తయారీకి చర్యలు చేపట్టామని తెలిపారు.

## 'స్థానికులకే టికెట్ కేటాయించాలి'

**ప్రజాశక్తి-పాయకరావుపేట:**పాయకరావుపేట కాంగ్రెస్ పార్టీ టికెట్ స్థానికులకే కేటాయించాలని కోరుతూ ఆ పార్టీ నాయకులు మారుతి నారాయణ చక్రవర్తి, భూర్తి ఏసుబాబు, మోర్త సింహాచలం, గారా సూర్యారావు తదితరులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా స్థానిక విలేకర్లతో సోమవారం వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి తామెంతో కష్టపడ్డామని, వేరే పార్టీ వ్యక్తి అయినబోని తాతారావుకు టికెట్ కేటాయించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. పార్టీ అధిష్టానం పెద్దలు టికెట్ కేటాయింపుపై పునరాలోచన చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెండ్లి రాట వేస్తున్న అర్చకులు, గ్రామ పెద్దలు

## ఘనంగా శివపార్వతుల పెండ్లి రాటోత్సవం

**ప్రజాశక్తి -నక్కపల్లి:**మండలంలోని ఉపమాకలోని లక్ష్మణేశ్వర స్వామి దేవస్థానంలో సోమవారం శివ పార్వతుల పెండ్లి రాటోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ చైర్మన్ చెరుకూరి వెంకటేశ్వరరావు, అర్చకులు మహేష్, సంపూర్ణపల్లి కృష్ణమాచార్యుల నేతృత్వంలో పెండ్లి రాటోత్సవాన్ని నిర్వహించారు.ఈ నెల 19 నుంచి లక్ష్మణేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామన్నారు.

## జనసేనలో చేరిక

**ప్రజాశక్తి -కొత్తకోట:**బుచ్చయ్యపేట మండలం వడ్డాదికి చెందిన వైసిపి నాయకులు సోమవారం కొత్తకోటలో నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జి పివిఎస్ఎన్ రాజు సమక్షంలో ఆ పార్టీలో చేరారు. జన సేనలో చేరిన వారిలో వడ్డాది మేజర్ పంచాయతీ సర్పంచ్ కోరుకొండ కామ లక్ష్మి, ఉప సర్పంచ్, మాజీ మండల ఉపాధ్య క్షులు దాడి సూరి నాగేశ్వరరావు, కో-ఆపరేటివ్ బ్యాంకు అధ్యక్షులు దొండా సన్యాసిరావు, వార్డ్ మెంబర్ అబోతి నూకరాజు ఆ పార్టీలో చేరారు.

## మూకుమ్మడిగా వాలంటీర్లు రాజీనామా

**ప్రజాశక్తి-కోటవురట్ల:**మండల వ్యాప్తంగా పలు గ్రామాల వాలంటీర్లు సోమవారం రాజీనామా చేశారు. ఈ మేరకు స్థానిక ఎంపీడీవో కాశీ విశ్వనాథరావుకు, సచివాలయ కార్యదర్శులకు రాజీనామా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ, మండల వ్యాప్తంగా 19 సచివాలయాలకు గాను సోమవారం నాటికి 243 మంది వాలంటీర్లు రాజీనామా పత్రాలు అందజేశారన్నారు.

**చీడికాడ :** వైసిపి అధినేత వైయస్ జగన్మోహన్ రెడ్డి పై రాళ్ల దాడికి నిరసనగా మండలంలోని వాలంటీర్లు మూకుమ్మడిగా రాజీనామా చేశారు. సోమవారం మండలంలోని జేబిపురం, అప్పలరాజుపురం, ఖండివరం, తురువోలు, సిరిజాం, అర్జునగిరి, జి కొత్తపల్లి, దిబ్బపాలెం, చుక్కపల్లి, కోనాం పంచాయతీలకు చెందిన 110 మంది వాలంటీర్లు చీడికాడ ఎంపీడీవో ఉమామహేశ్వరికి తమ రాజీనామా పత్రాలను అందజేశారు.

**భీమునిపట్నం :** మండలంలోని అమనాం గ్రామ పంచాయతీకి చెందిన 17 మంది గ్రామ వాలంటీర్లు సోమవారం ఎంపిడిఒ డాక్టర్ వి.జానకికి రాజీనామా పత్రాలను అందజేశారు. కొన్ని వ్యక్తిగత కారణాల వల్ల రాజీనామా చేస్తున్నట్లు వాలంటీర్లు పేర్కొన్నారు. రాజీనామాలను ఆమోదించినట్లు ఎంపిడిఒ తెలిపారు. మండలంలోని పలు గ్రామ పంచాయతీలకు చెందిన 47 మంది వాలంటీర్లు ఇప్పటివరకు రాజీనామా చేసినట్లు తెలిపారు.

చీడికాడలో రాజీనామా లేఖలు ఇస్తున్న వాలంటీర్లు

## డిగ్రీ కళాశాలలో ఉచిత కంప్యూటర్ శిక్షణ

అవగాహన కల్పిస్తున్న అధ్యాపకులు

**ప్రజాశక్తి-మాడుగుల:**స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉచిత కంప్యూటర్ శిక్షణ తరగతులు ప్రారంభించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సివిఎస్ శాస్త్రి తెలిపారు. సోమవారం స్థానిక డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన ఉచిత కంప్యూటర్ శిక్షణ తరగతుల ప్రారంభ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ప్రతి ఒక్కరికి డిజిటల్ అక్షరాస్యత అవసరమని, ఇందుకోసమే గ్రామీణ యువతకు ఉచితంగా ఆఫీస్ ఆటోమేషన్ టూల్స్ పై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. దీంతో పాటు పోటీ పరీక్షలకు కూడా తమ కళాశాలలోని ఉచితంగా శిక్షణ ఇస్తున్నామన్నారు. కళాశాలలో అనుభవజ్ఞులైన అత్యధిక అర్హతలు కలిగిన అధ్యాపకులు ఉన్నారని వారితో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని గ్రామీణ యువతీ యువకులు, గృహిణులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ జి.జయలక్ష్మి అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న అధికారులు

## సర్వే సిబ్బందికి అవగాహన

**ప్రజాశక్తి-కోటవురట్ల:** రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సమగ్ర భూ సర్వేలో భాగంగా నాన్ సిగ్నల్ (అంతర్జాలం) ప్రాంతాలలో సర్వే ఎలా నిర్వహించాలనే అంశంపై స్థానిక మండల సర్వేయర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో సోమవారం భూ సర్వే అసిస్టెంట్ డైరెక్టర్ గోపాలరాజు జగ్గంపేట రెవెన్యూ గ్రామంలో అవగాహన కల్పించారు. కోటవురట్ల, రోలుగుంట, దేవరాపల్లి, నాతవరం మండలాల గ్రామ సర్వేయర్లకు అంతర్జాలం అందుబాటులో లేని ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో సర్వే విధానంపై వివరించారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం డిఐఓఎస్ బంగారు దేవి, టాస్క్ ఫోర్స్ డిఐఓఎస్ వేణుగోపాల్, వెంకన్న పాల్గొన్నారు.

## అయ్యన్నను కలిసిన తాతయ్యబాబు

**ప్రజాశక్తి-అనకాపల్లిడెస్క్:**అనకాపల్లి జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బత్తుల తాతయ్యబాబు సోమవారం మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడుతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా జిల్లాలోని పార్టీ విషయాలపై చర్చించారు. జిల్లా అధ్యక్షులుగా నియమితులైన తర్వాత తొలిసారిగా అయ్యన్నను కలిసి శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు లాలం కాశీనాయుడు తదితరులు పాల్గొన్నారు.

అయ్యన్నను సన్మానిస్తున్నతాతయ్యబాబు

ప్రతిభ చాటిన విద్యార్థులతో అధ్యాపకులు

## ఇంటర్‌లో ఆదిత్య విద్యార్థుల సత్తా

**ప్రజాశక్తి-అనకాపల్లిడెస్క్:**ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాలలో నర్సీపట్నం ఆదిత్య జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. ఇంటర్ ఫస్ట్ ఇయర్ ఎంపీసీలో పి.కుసుమశ్రీ 453/470, పి.హిమబిందు 449, పి.దీపిక 445, సిహెచ్.దినేష్ 439, టి.హర్షవర్ధన్ 425, బైపీసీలో జి.గంగోత్రి 411/440, ఎస్.దుర్గాదేవి 402/440, ఇంటర్ సెకండ్ ఇయర్ ఎంపీసీలో ఎస్.గంగాభవాని 980/1000, సిహెచ్.వెంకట శిరీష 951, జి.హేమలత 934, వి.దుర్గాప్రసాద్ 909, బి.పావని 907, బైపీసీలో సిహెచ్. దుర్గ భవాని 937/1000, ఎస్.పద్మ 904, సీఈసీలో ఎన్.విజయదుర్గ 917లు అధిక మార్కులు సాధించి టాపర్స్‌గా నిలిచారు. అధిక మార్కులు సాధించి టాపర్స్‌ను కరస్పాండెంట్ ఎల్.హరిప్రసాద్, ప్రిన్సిపాల్ అండ్ డైరెక్టర్ ఎస్.రామ జోగారావు, డైరెక్టర్ కె.రమణ అభినందించారు.

# రూ.2.18 లక్షలు పట్టివేత

**ప్రజాశక్తి -తగరపువలస :** స్థానిక గోస్తనీ చెక్ పోస్ట్ వద్ద తనిఖీల్లో భాగంగా సోమవారం ఎస్ఎస్‌టి బృందం సభ్యులు జివిఎంసి ఒకటో జోన్ యుసిడి, పిడి వైసంతోష్‌కుమార్, మహిళా పోలీసు కానిస్టేబుల్ గౌరీశ్వరమ్మ తనిఖీ చేశారు. మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో సింగన బంద ఓ క్రిడ్జి స్కూల్‌కు చెందిన కారు విశాఖ వైపు వస్తుండగా ఎస్ఎస్‌టి బృందం సభ్యులు కారులో తనిఖీ చేపట్టారు. కారులో స్కూల్ అకౌంటెంట్ వద్ద రూ.2లక్షల 18 వేల 791 పట్టుబడ్డాయని పోలీసులు తెలిపారు. ఈ సమాచారాన్ని ఇఎస్ఎంఎస్ యాప్ ద్వారా పంపించామని పోలీసులు చెప్పారు. భీమిలి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## వామపక్ష అభ్యర్థుల గెలుపు అవసరం

ప్రజాశక్తి -గోపాలపట్నం : పరిశ్రమల మనుగడకు వామపక్ష అభ్యర్థుల గెలుపు ఆవశ్యమని వామపక్ష కార్మిక, యువజన, విద్యార్థి, మహిళా సంఘాల నేతలు పేర్కొన్నారు. విశాఖ పశ్చిమ నియోజకవర్గంలో ఇండియా ఫోరం తరుపున సిపిఐ నుంచి పోటీచేస్తున్న అత్తిలి విమలకు మద్దతుగా ఎఐటియుసి, ఎన్ఎఫ్ఐడబ్ల్యు, ఎఐఎస్ఎఫ్, ఎఐవైఎఫ్, డిహెచ్‌పిఎస్ తదితర ప్రజా సంఘాల ఆధ్వర్యాన సోమవారం మర్రిపాలెంలో మీడియా సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, విశాఖలోని పరిశ్రమలను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రయివేటుకు ధారాదత్తం చేయడానికి చూస్తోందన్నారు. ఇందుకు అధికార, ప్రధాన ప్రతిపక్షం సహకరిస్తున్నాయని ఆరోపించారు. ఈ సార్వత్రిక ఎన్నికల్లో ఇండియా ఫోరం అభ్యర్థులను గెలిపించాలని కోరారు. సమావేశంలో ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి జిఎస్‌జె అచ్యుతరావు, అధ్యక్షులు ఎం.మన్మథరావు, నాయకులు ఎస్‌కె.రెహమాన్, కసిరెడ్డి సత్యనారాయణ, జి.రాంబాబు, ఎమ్‌డి బేగం, పుష్ప, అచ్యుతరావు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## అప్పన్న కల్యాణోత్సవం ఏర్పాట్లపై ఇఒ సమీక్ష

ప్రజాశక్తి-సింహాచలం : శ్రీవరహాలక్ష్మినృసింహ స్వామి రథోత్సవం, వార్షిక కల్యాణోత్సవం ఈ నెల 19వ తేదీన నిర్వహించనున్న నేపథ్యంలో ఏర్పాట్లపై ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి సోమవారం సమీక్ష నిర్వహించారు. స్థానాచార్యులు రాజగోపాల్, ప్రధాన అర్చకులు శ్రీనివాసచార్యులు, ఆలయ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీనివాసరాజు, రాంబాబు, సహాయ కార్య నిర్వహణ అధికారులు దేవస్థానం సిబ్బంది, వివిధ శాఖ అధికారులతో స్వామివారి నిత్య కల్యాణ మండపం నందు సమన్వయ సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ, భక్తుల సౌకర్యార్థం మంచినీరు, మజ్జిగ, మెడికల్ క్యాంపులు ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు. అన్న ప్రసాదం భవనంలో భోజనాలు ఏర్పాట్లుచేస్తున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో ట్రాఫిక్ ఎడిసిపి జి.శ్రీనివాసరావు, డిసిపి రాజీవ్‌కుమార్, లా అండ్ ఆర్డర్ డిసిపి సత్తిబాబు, ఎసిబి నరసింహమూర్తి, గోపాలపట్నం సిఐ సురేష్ పాల్గొన్నారు.

# ఆరో రోజుకు 'గంగవరం' ఆందోళన

ధర్నా చేస్తున్న గంగవరం పోర్టు కార్మికులు

ప్రజాశక్తి -గాజువాక : సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అదాని గంగవరం పోర్టు కార్మికులు చేపట్టిన దీక్షలు సోమవారం నాటికి ఆరో రోజుకు చేరుకున్నాయి. సోమవారం అధిక సంఖ్యలో కార్మికుల పాల్గొని ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా గంగవరం పోర్టు ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి నొల్లి తాతారావు మాట్లాడుతూ, గంగవరం పోర్టులో ఇస్తున్న వేతనాలతో బ్రతకలేక వేతనాలు పెంచాలని కోరుతూ ఆందోళన చేస్తుంటే, యాజమాన్యం మొండిగా వ్యవహరిస్తుందన్నారు. అంతేకాకుండా ముగ్గురు కార్మికులను బదిలీ చేస్తున్నామని అర్ధరాత్రి వాట్సాప్‌లో మెసేజ్ చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. అదాని గంగవరం పోర్టులో కార్గో హ్యాండిల్ పనులు చేస్తున్న కార్మికులను జార్ఖండ్, కోల్‌కతా, ఒడిశాలోని సిమెంట్ ఫ్యాక్టరీలకు బదిలీ చేస్తామని చెప్పడం దారుణమన్నారు. యాజమాన్యం బరితెగించి వ్యవహరిస్తోందని విమర్శించారు. విశాఖ పోర్టుకు సమానంగా గంగవరం పోర్టులో కార్మికుల వేతనాలు సవరించాలని డిమాండ్ చేశారు. కనీసం రూ.36 వేలతో పాటు ఇతర అలవెన్సులు, సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ సౌకర్యం కల్పించాలని డిమాండ్‌చేశారు. యూనియన్ ఉపాధ్యక్షులు కోవిరి అప్పలరాజు మాట్లాడుతూ, యాజమాన్యం స్పందించి సంప్రదింపులు ద్వారా సమస్య పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. లేకుంటే ఆందోళన మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్మికుల బదిలీ ఉత్తర్వులను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గంటిపిల్లి అమ్మోరు, మాద అప్పారావు, స్వామి, సత్యానందం, నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

### ఎఐటియుసి సంఘీభావం

అదాని గంగవరం పోర్టు కార్మికులకు విశాఖ జిల్లా ఎఐటియుసి సంఘీభావం తెలిపింది. సోమవారం పోర్టు ప్రధాన గేటు వద్ద నిరసన తెలుపుతున్న కార్మికులను ఉద్దేశించి ఎఐటియుసి జిల్లా కార్యదర్శి జిఎస్ఎన్ అచ్యుతరావు, కసిరెడ్డి సత్యనారాయణ మాట్లాడారు.

## బెదిరింపులు ఆపి సమస్యలు పరిష్కరించాలి : గంగారావు

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న గంగారావు

ప్రజాశక్తి -గాజువాక : అదాని గంగవరం పోర్టు బెదిరింపులు ఆపి, కార్మికుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని గంగవరం పోర్టు ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు డాక్టర్ బి.గంగారావు కోరారు. గాజువాక సిఐటియు కార్యాలయంలో సోమవారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గంగవరం పోర్టు కార్మికులు ఆరు రోజుల నుంచి ఆందోళన చేస్తున్నారని, దీనిపై కలెక్టర్ చర్చలకు పిలిచి యాజమాన్యంతో మాట్లాడారని తెలిపారు. ఒక పక్క చర్చల ద్వారా సమస్యలు పరిష్కరిస్తామని చెబుతూనే మరో పక్కన కార్మికులకు బదిలీ చేస్తామని బెదిరిస్తూ ఆదివారం రాత్రి వాట్సాప్‌లో నోటీసులు పంపించారని తెలిపారు. ఇది చట్టరీత్యా చెల్లదన్నారు. గతంలో గంగవరం పోర్టు సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ అపాయింట్‌మెంట్ ఆర్డర్ ఇచ్చిందని, అప్పుడు ఆ యాజమాన్యానికి ఒకే పోర్టు ఉందని, అదానీ కొనుక్కున్న తర్వాత రీ అపాయింట్‌మెంట్ ఆర్డర్ ఏమీ ఇవ్వలేదని వివరించారు. ఆందోళన చేస్తున్నారని కొంతమంది కార్మికులను బెదిరించడానికి ఒడిశా, జార్ఖండ్, కోల్‌కతాలోని సిమెంట్ పరిశ్రమలకు బదిలీ చేస్తామని వాట్సాప్ ద్వారా ముగ్గురు కార్మికులకు నోటీసులు పంపడం, అడ్మిన్ భవనంలో వచ్చి కలవాలని చెప్పడం దుర్మార్గం అన్నారు. వెంటనే ఈ నోటీసులు వెనక్కి తీసుకోవాలని డిమాండ్‌చేశారు.

యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ బి.జగన్ మాట్లాడుతూ, రవి, మహేష్, ఉపేంద్రను బదిలీ చేసి భయపెట్టాలని చూస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. కార్మికుల సమస్యలు పరిష్కారమయ్యే వరకు నిరసన కొనసాగిస్తామని స్పష్టంచేశారు. విలేకర్ల సమావేశంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు కెఎం.శ్రీనివాస్, యూనియన్ ప్రధాన కార్యదర్శి తాతారావు, నాయకులు అప్పలరాజు, ఉపేంద్ర, మహేష్, రవి తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న వైసిపి అభ్యర్థి భరత్ కుమార్

## వైసిపి శ్రేణులతో భరత్ కుమార్ సమావేశం

ప్రజాశక్తి- కశింకోట

మండలంలోని తాళ్లపాలెం వైసిపి కార్యాలయంలో ఆ పార్టీ మండల విస్తృతస్థాయి సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా అనకాపల్లి వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్ కుమార్ పార్టీ నాయకులకు కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు జగన్మోహన్ రెడ్డి ఐదు సంవత్సరాల్లో చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. ఈ సమావేశంలో అనకాపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు, వెసిపి జిల్లా అధికార ప్రతినిధి మల్ల బుల్లిబాబు, మండల అధ్యక్షులు మలసాల కిషోర్, జెడ్పిటిసి దంతులూరి శ్రీధర్ రాజు, ఎంపీపీ కలగా లక్ష్మిగున్నయ్య నాయుడు, వైస్ ఎంపీపీలు పెంటకోట జ్యోతి శ్రీనివాస్, నమ్మి మీనా గణేష్, కసింకోట మండలంలోని వైసిపి సర్పంచులు, ఎంపీటీసీలు, వార్డ్ మెంబర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజాధరణ చూసి ఓర్వలేకే జగన్‌పై హత్యాయత్నం

### వైసిపి ఉత్తరాంధ్ర రీజినల్ కోఆర్డినేటర్ వైవి.సుబ్బారెడ్డి

మాట్లాడుతున్న వైసిపి రీజినల్ కోఆర్డినేటర్ వైవి.సుబ్బారెడ్డి

ప్రజాశక్తి-చోడవరం

రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డికి వస్తున్న ప్రజాధరణ చూసి ఓర్వలేక ఆయనపై టిడిపి హత్య ప్రయత్నానికి యత్నించిందని వైసిపి ఉత్తరాంధ్ర రీజినల్ కోఆర్డినేటర్ వైవి సుబ్బారెడ్డి అన్నారు. చోడవరం వైసీపీ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే వైసిపి అభ్యర్థి కరణం ధర్మశ్రీ అధ్యక్షతన సోమవారం జరిగిన నియోజకవర్గస్థాయి కార్యకర్తల సమావేశంలో వైవి.సుబ్బారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు వైసిపికి అనుకూలంగా ఉన్నారని, ఎన్ని పార్టీలు కలిసినా వైసీపీ విజయాన్ని అడ్డుకోలేవని, జగన్ రెండో సారి అధికారం చేపడతారని స్పష్టం చేశారు. అనకాపల్లి ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు మాట్లాడుతూ బ్యాంకుల్ని నట్టేట ముంచి, రాష్ట్రంలో ఎక్కడా చెల్లుబాటు కానీ సీఎం రమేష్ అనకాపల్లి ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారన్నారు. ఆయన వచ్చిన వెంటనే అధికారులపై జులుం ప్రదర్శించారని, ఇటువంటి వ్యక్తులను గెలిపిస్తే అనకాపల్లి ప్రాంతంలో శాంతిభద్రతలకు విఘాతం కలుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. చోడవరం ఎమ్మెల్యే అభ్యర్థి కరణం ధర్మశ్రీ మాట్లాడుతూ టిడిపి తమ వారికే కండువాలు వేస్తూ వైసీపీ నుండి వస్తున్నారని తప్పుడు ప్రచారం చేస్తుందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నియోజకవర్గ పరిశీలకులు కాశీ విశ్వనాథం, గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, వైసిపి జిల్లా అధ్యక్షులు బొడ్డేటి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అదీప్‌రాజ్‌కు పూలమాల వేస్తున్న వైసిపి నేతలు, కార్యకర్తలు

## వైసిపి అభ్యర్థి అదీప్‌రాజ్ ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి-పరవాడ : మండలంలోని ఈ బోనంగి, పి.బోనంగి పంచాయతీల్లో పెందుర్తి వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి అన్నంరెడ్డి అదీప్‌రాజ్ సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మే 13న జరగబోయే ఎన్నికలలో ఎంపీ, ఎమ్మెల్యే ఓట్లును ఫ్యాన్ గుర్తుపై వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఎమ్మెల్యేగా తనకు మరో అవకాశం ఇస్తే పెందుర్తి నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ పైల సన్యాసిరాజు, వైసిపి రాష్ట్ర సీఈసీ సభ్యులు పైల శ్రీనివాసరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రాము నాయుడు, మండల జెసిఎస్ కన్వీనర్ వెన్నెల సన్యాసిరావు, గొర్లివాన్నిపాలెం సర్పంచ్ గొర్లి గోపి అమ్ములు, పెందుర్తి మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ పైల అప్పలనాయుడు, వైసిపి గ్రామ నాయకులు బొద్దపు చిన్నారావు, కంచిపాటి భాస్కర్, ఆర్ఇసిఎస్ మాజీ చైర్మన్ చల్ల కనకరావు, మాజీ ఎంపీటీసీ డెక్క శ్రీనివాసరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అయ్యన్న విద్యార్థులకు ఉచిత వైద్య సేవలు

ప్రజాశక్తి-కె.కోటపాడు

స్థానిక సంజీవని ఆసుపత్రి కె.కోటపాడు అయ్యన్న విద్యాసంస్థల విద్యార్థులకు సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని అయ్యన్న విద్యాసంస్థల అధినేత డాక్టరు ఖాశీం ప్రారంభించారు. చిన్నపిల్లల వైద్య నిపుణులు డాక్టరు బాలాజీ, జనరల్ ఫిజీషియన్ డాక్టరు డానియేల్ 380 మంది విద్యార్థులకు, సిబ్బందికి ఉచితంగా పరీక్షించి, రక్త పరీక్షలు చేశారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టరు డానియేల్ మాట్లాడుతూ విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. తల్లిదండ్రులు పిల్లల ఆరోగ్యం పట్ల ఎప్పటికప్పుడు తగు శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. విద్యార్థులకు ఉచిత ఆరోగ్య సేవలందించిన సంజీవని హాస్పిటల్ డాక్టర్లు, స్టాఫ్‌కు విద్యా సంస్థల అధినేత డాక్టరు ఖాశీం కృతజ్ఞతలు తెలిపారు. డాక్టరు డానియేల్, బాలాజీని తదితరులను ఈ సందర్భంగా డాక్టరు ఖాశీం ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో బోధన సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు